Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా “సత్యమేవ జయతే” తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9398191920.

సంపుటి : 01 సంచిక : 102 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ గురువారం17-4-2025 పేజీలు :12 వెల : 2/-

## భాగ్యనగరాన బెట్టింగ్ భూతాలు



- చక్రం తిప్పుతున్న హైదరాబాద్‌కుచెందిన వ్యాపారవేత్త
- మ్యాచ్‌ఫిక్సింగ్ కోసం ముమ్మరప్రయత్నాలు
- క్రీడాకారులతో చెట్టపట్టాలు డబ్బు,విలువైన కానుకలు ఎర
- క్రిక్ బజ్ నివేదికలో వెలుగులోకి సంచలనాలు
- ఫ్రాంచైజీలనుఅప్రమత్తం చేసిన బిసిసిఐ

**హైదరాబాద్:** సాఫీగా సాగిపోతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) సీజన్ 2025కి మ్యాచ్ ఫిక్సింగ్ భయం పట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త మ్యాచ్ ఫిక్సింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నాడని..ఐపిఎల్ ఫ్రాంచైజీ ఓనర్లు, ఆటగాళ్లు, కోచ్‌లు అప్రమత్తంగా ఉండాలని భారత క్రికెట్ బోర్డు సూచించింది. ఈ మేరకు పది ఫ్రాంచైజీలకు బిసిసిఐ హెచ్చరికలు కూడా జారీ చేసినట్టు ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ క్రిక్‌బజ్ పేర్కొంది. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం ఆ వ్యాపారవేత్తకు బుకీలతో సంబంధాలు ఉన్నట్టు బిసిసిఐ అవినీతి నిరోధక భద్రతా విభాగం (ఎసిఎస్‌యు) గుర్తించినట్టు సమాచారం. తెలుగు రాష్ట్రాల్లో ఈ వ్యాపారవేత్తకు ప్రముఖ సెలబ్రిటీగా పేరుంది. సినీ, క్రీడా ప్రముఖులతో చెట్టపట్టాలు వేసుకుని తిరగడం ఆయనకు అలవాటు. సచిన్ టెండూల్కర్ వంటి క్రికెట్ దిగ్గజంతో సైతం ఆయనకు మంచి స్నేహం ఉంది. హైదరాబాద్ వేదికగా జరిగే అంతర్జాతీయ మ్యాచుల్లో కూడా నానా హంగామా చేస్తుంటాడు.అంతేగాక అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించే క్రీడాకారులకు విలువైన బహుమతులు గిఫ్ట్‌గా ఇస్తుంటాడు. సైనా నెహ్వాల్, సానియా మీర్జా, పివి. సింధు, నిఖత్ జరీన్‌తో సహా పలువురు స్టార్ క్రీడాకారులకు విలువైన బహుమతులు ఇచ్చాడు. డబ్బే కాకుండా విలువైన

మిగతా 2లో



## హిందూ బోర్డుల్లో ముస్లింలు ఉన్నారా?

- వందల ఏళ్ల నాటి మసీదులకు సంబంధించిన దస్తావేజులు ఉంటాయా?
- 1940వ దశకం నుంచి అమలులో ఉన్న వక్ఫ్
- బై యూజర్ క్లాజ్‌ను తొలగించే అధికారం మీకు ఉన్నదా?
- కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు చేపట్టింది. కొత్త చట్టంలోని పలు కీలక నిబంధనల పై అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించే నిబంధనను ప్రస్తావిస్తూ, హిందూ ఎండోమెంట్ బోర్డులలో ము స్లిం సభ్యులు ఉండేందుకు అనుమతి ఇస్తారా అని ప్రభుత్వాన్ని సుప్రీం ప్రశ్నించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఆధ్వర్యంలో జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కెవి విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం కొత్త వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దేశవ్యాప్తంగా దాఖలైన 73 పిటిషన్లను విచారిస్తోంది. ఈ సందర్భంగా వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హింసాత్మక నిరసనలు జరగడం ఆందోళన కల్గిస్తోందని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విషయంలో మొదట రెండు అంశాలపై స్పష్టత రావాలని చీఫ్ జస్టిస్ ఖన్నా అన్నారు. మొదటిది సుప్రీంకోర్టు పిటిషన్లను హైకోర్టు కు పంపుతుందా లేదా అన్నది, ఆలాగే చట్టంలో ముఖ్యంగా పిటిషనర్లు ఏ అంశాలపై వాదించాలనుకుంటున్నారన్నది తేలాలన్నారు. పిటిషనర్లలో ఒకరి తరుపున హాజరైన సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ మాట్లాడుతూ కొత్త

మిగతా 2లో

## సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తాం:మంత్రి శ్రీధర్



కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన పోస్టుపై చట్టప్రకారం తాము ముందుకు వెళతామని తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫొటోను షేర్ చేసినందుకు పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేయడంపై ఆయన స్పందించారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని మంత్రి తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసిందని గుర్తు చేశారు. నకిలీ వీడియోలు, ఫొటోలు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూముల

మిగతా 2లో

## కొందరు జైలుకు వెళ్లాల్సి వస్తుంది

- ప్రభుత్వం చేపట్టిన చర్యలను సమర్థించుకోవడానికి ప్రయత్నించడం కంటే పునరుద్ధరణ ప్రణాళికను చేస్తే ప్రయోజనం
- క్రేంద్ర సాధికార కమిటీ దాఖలు చేసిన నివేదికకు ప్రతిస్పందనగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి నాలుగు వారాల సమయం



**హైదరాబాద్ :** తెలంగాణలో వివాదాస్పదంగా మారిన కంచ గచ్చిబౌలి భూములపై రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి నిరాశ ఎదురైంది. కేంద్ర సాధికార కమిటీ దాఖలు చేసిన నివేదికకు ప్రతిస్పందనగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది. అవి ప్రభుత్వ భూములు అని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఏ సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఇదివరకే కౌంటర్ దాఖలు చేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం మరో సారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు స్టేటస్ కో కొనసాగించాలని తీర్పు ఇచ్చింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ మే 15వ తేదీకి వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములపై విచారణ సందర్భంగా జడ్జి జస్టిస్ బిఆర్ గవాయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను సమర్థించుకోవడానికి ప్రయ త్నించడం కంటే పునరుద్ధరణ ప్రణాళికను చేస్తే ప్రయోజనం చేకూరుతుందని ధర్మాసనం నొక్కి చెప్పింది. సరైన, ఆమోదయోగ్యమైన ప్రణాళికను సమర్పించడంలో

మిగతా 2లో

## సిద్ధాంతాల పోరులో కాంగ్రెస్‌దే పైచేయి కాగలదు



- ఆరెస్సెస్ బిజెపిని పార్టీ ఓడించగలదు
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ
- గుజరాత్‌లో పార్టీ పునరుజ్జీవానికి నాంది

మోదసా (గుజరాత్) : గుజరాత్‌లో కాంగ్రెస్ శ్రేణులు ‘నైతిక స్థైర్యం కోల్పోయినట్లుగా’ కనిపిస్తోందని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం అంగీకరించారు. తమ పార్టీ మాత్రమే ఆర్‌ఎస్‌ఎస్‌బిజెపి ద్వయాన్ని ఓడించగలదని ఆయన స్పష్టం చేశారు. కాషాయ ప్రత్యర్థులతో పోరును సైద్ధాంతిక పోటీగా ఆయన అభివర్ణించారు. గుజరాత్‌లో రాహుల్ పర్యటించడం ఒక వారంలో ఇది రెండవ సారి. రాష్ట్రంలో పార్టీ పునరుజ్జీవానికి రాహుల్ ఒక వ్యూహాన్ని ప్రతిపాదించారు. క్రియాశీలకంగా లేని, లేదా ‘బిజెపి కోసం పని చేస్తున్న’ పార్టీ నాయకులను తొలగిస్తామని ఆయన వాగ్దానం చేశారు. ఒకప్పుడు శక్తిమంతమైన రాజకీయ శక్తిగా కాంగ్రెస్ ఉన్న రాష్ట్రం గుజరాత్ ప్రతిపక్షానికి అత్యంత ముఖ్యమైన రాష్ట్రం అని ఆయన పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను, సుమారు 30 సంవత్సరాలుగా గుజరాత్‌లో అధికారంలో ఉన్న బిజెపిని చిత్తు చేయాలన్న దృఢసంకల్పాన్ని రాహుల్ వ్యక్తం చేశారు. గుజరాత్‌లో సంస్థ పునరుజ్జీవానికి వృద్ధ పార్టీ పథకంలో భాగంగా జిల్లా శాఖలను పటిష్ఠం చేసే పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన తరువాత రాహుల్ ఆరావళి జిల్లా మోదసా పట్టణంలో బూత్ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. గుజరాత్‌లో 2027 ద్వితీయార్థంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఒక ఎఐసిసి పరిశీలకుడు, నలుగురు రాష్ట్ర పరిశీలకులతో కూడిన ఐదుగురు సభ్యుల కమిటీ ఆరావళి జిల్లాతో ఆరంభించి గుజరాత్‌లో పార్టీ 41 జిల్లా శాఖలు (ఎనిమిది నగరాలతో సహా)

మిగతా 2లో

## బంగారం..లకారం

- రూ.లక్షకు చేరువలో బంగారం ధర 10గ్రాములకు రూ.98వేలు దాటిన పసిడి
- ఒక్కరోజే రూ.1650 పెరిగిన రేటు
- రూ.99,400లకు చేరుకున్న కిలో వెండి ధర



## పనికి మాలిన హార్వర్డ్

- చదువులు తక్కువ చావు తెలివితేట లెక్కువ
- లెఫ్ట్ మేయర్ల నిధులతో తప్పుడు దారి
- ప్రముఖ వర్శిటీపై ట్రంప్ ఫైర్



**వాషింగ్టన్ :** హార్వర్డ్ వర్శిటీ పేరు గొప్ప ఊరు దిబ్బ బాపతు అని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. హార్వార్డ్ ఓ జోక్ అని, అది చదవుకునే వేదిక కాదని తెలిపారు. ఇటీవలే అమెరికాలో ట్రంప్ అధికార యంత్రాంగం హార్వర్డ్ విద్యాసంస్థకు దాదాపుగా 2.3 బిలియన్ డాలర్ల గ్రాంటును నిలిపివేసింది. ఇకపై ఈ సంస్థ కార్యకలాపాలను కుదించాల్సి ఉందని కూడా ఉత్తర్వులు వెలువరించారు. దీనితో ఈ ప్రముఖ సంస్థ మనుగడ ప్రశ్నార్థకం

మిగతా 2లో

# భాగ్యనగరాన బెట్టింగ్ భూతాలు

వస్తువులు ఎరగా వేసి వార్తల్లో నిలుస్తుంటాడు. తాజాగా ఆ వ్యాపారవేత్త చాలా మంది క్రికెటర్లు, కోచ్‌లతో స్నేహం చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు క్రిక్‌బజ్ తన నివేదికలో వివరించింది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లు, ఫ్రాంచైజీలు, కోచ్‌లు అలర్ట్‌గా ఉండాలని బిసిసిఐ సూచించింది. ఆ వ్యక్తి ఎవరినైనా సంప్రదిస్తే తమకు సమాచారం అందించాలని బోర్డు కోరింది. బిసిసిఐ హెచ్చరిక నేపథ్యంలో ఒక్కసారిగా ఐపిఎల్ టోర్నమెంట్‌కు ఫిక్సింగ్ భూతం భయం పెట్టుకుంది. చాలా ఏళ్లుగా ఎలాంటి అడ్డంకులు లేకుండా పొట్టి క్రికెట్ సాఫీగా సాగిపోతోంది. కానీ ఓ వ్యాపారవేత్త ఫిక్సింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు వార్తలు రావడం సంచలనంగా మారింది. బిసిసిఐ హెచ్చరికల నేపథ్యంలో ఆయా ఫ్రాంచైజీలు కూడా అప్రమత్తమయ్యాయి.ఆటగాళ్లు, కోచ్‌లు అలర్ట్‌గా ఉండాలని, అపరచిత వ్యక్తులతో స్నేహానికి దూరంగా ఉండాలని, మ్యాచ్‌లు ముగిసిన తర్వాత హొటల్ గదులకే పరిమితం కావాలని ఆయా ఫ్రాంచైజీలు యాజమాన్యాలు ఆటగాళ్లకు హుకూం జారీ చేసినట్టు సమాచారం. పది జట్లు పాల్గొంటున్న ఐపిఎల్ సీజన్ 2025 ఆసక్తికరంగా సాగుతోంది. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన గుజరాత్, ఢిల్లీ, పంజాబ్, లక్నో వంటి జట్లు అద్భుత ఆటతో పాయింట్ల పట్టికలో ముందు వరుసలో కొనసాగుతున్నాయి.

# హిందూ బోర్డుల్లో ముస్లింలు ఉన్నారా?

చట్టంలోని అనేక అంశాలు మతపరమైన వ్యవహారాలకు సంబంధించి స్వేచ్ఛను హామీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను ఉల్లంఘిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్త చట్టం అమలులో తలెత్తే వివాదాలను పరిష్కరించే అధికారాలను కలెక్టర్లకు ఇచ్చిన అంశాన్ని ప్రస్తావించారు. కలెక్టర్ ప్రభుత్వంలో భాగంగా పనిచేస్తారని, ఆయనకు జడ్జి పాత్ర పోషించే అధికారాలు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని వాదించారు.చట్టంలో %-% వక్ఫ్ బై యూజర్ %-% అంటే వినియోగదారుని ద్వారా వక్ఫ్ అన్న నిబంధనను ప్రస్తావించారు. అధికార పత్రాలు లేకుండా మతపరమైన ఆస్తిని వక్ఫ్ గా పరిగణించే నిబంధన ఇది. కొత్త చట్టం దీనికి ఓ మినహాయింపు కల్పించిందని. ఇది వివాదంలో ఉన్న లేదా ప్రభుత్వ భూమి, ఆస్తులకు వర్తించదని కపిల్ సిబల్ పేర్కొన్నారు. వినియోగదారుని ద్వారా వక్ఫ్ అన్నది ఇస్లాంలో అంతర్భాగం అని సిబల్ అన్నారు. వక్ఫ్ 3 వేల ఏళ్లక్రితం ఏర్పడిందని, దానికి దస్తావేజులు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉండవని న్యాయవాది సిబల్ పేర్కొన్నారు. మరో పిటిషనర్ తరుపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి మాట్లాడుతూ దేశంలో 8 లక్షల వక్ఫ్ ఆస్తులలో నాలుగు లక్షల ఆస్తులు వక్ఫ్ బై యూజర్ కు చెందినవేనని అన్నారు. తాము మొత్తం చట్టంపై కాకుండా %-% వక్ఫ్ బై యూజర్ %-% తోపాటు కొన్ని నిబంధనలపై స్టే కోరుతున్నామని అభిషేక్ సింఘ్వీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకుని ఢిల్లీ హైకోర్టు కూడా వక్ఫ్ భూమిలో నిర్మించినదని అంటున్నారని, వక్ఫ్ బై యూజర్ %-% నిబంధన తప్పు అని చెప్పడం లేదని అయితే , ఈ విషయంలో కొంత ఆందోళన ,గందరగోళం ఉందన్నారు.
కేంద్రప్రభుత్వం తరుపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదన వినిపిస్తూ, పార్లమెంటులో విస్తృత చర్చల తర్వాత ఈ చట్టం ఆమోదం పొందిందని, రెండు సభల సంయుక్త పార్లమెంటరీ కమిటీ విస్తృతంగా చర్చించి దీనిని రూపొందించిందని, ఉభయసభలు ఆమోదించాయని పేర్కొన్నారు. కొత్త చట్టంలోని - వినియోగదారుల ద్వారా వక్ఫ్ %-% నిబంధనపై దృష్టి పెట్టాలని ప్రధాన న్యాయమూర్తి సొలిసిటర్ జనరల్ మెహతాను కోరారు. కోర్టు తీర్పు ద్వారా వక్ఫ్ బై యూజర్ నిబంధన సమర్థిస్తే, అది చెల్లదని మీరు వాదించగలరా అని నిలదీశారు. 13,14,15 శతాబ్దాల కాలంలో నిర్మించిన మసీదులకు సంబంధించి పత్రాలు సమర్పించడం అసాధ్యం కాదా అని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు. ప్రభుత్వం వక్ఫ్ బై యూజర్ నిబంధనను డీ నోటిఫై చేయబోతున్నట్లయితే , సమస్య తప్పదని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. వక్ఫ్ పేరున కొంత దుర్వినియోగం జరిగినా, నిజమైన వక్ఫ్ కూడా ఉందని ధర్మాసనం పేర్కొంది. కొత్త చట్టంలోని సానుకూల అంశాలను హైలైట్ చేయాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. కేసు విచారణను రేపటికి వాయిదా వేశారు.
న్యూఢిల్లీ :వక్ఫ్ సవరణ చట్టం పై దాఖలైన పిటిషన్ల విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం చట్టం కొన్ని భాగాలపై మధ్యంతర స్టే ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తోంది. అయితే చట్టంపై కేంద్రం, రాష్ట్రాలకు తమ వాదన పూర్తిగా వినిపించేందుకు మరో 2,3 రోజుల వ్యవధి ఇవ్వాలని చివరి నిముషంలో స్టే ఆలోచనను న్యాయమూర్తులు మానుకున్నారు. ధర్మాసనం చట్టంలోని మూడు కీలక అంశాలను లేవనెత్తింది. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలనే అభిప్రాయాన్ని న్యాయమూర్తులు సూచించారు. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆధ్వర్యంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం కేసు విచారణను రేపటికి వాయిదా వేసింది.

# కొందరు జైలుకు వెళ్లాల్సి వస్తుంది

విఫలమైతే కొంతమంది అధికారులు తాత్కాలికంగా జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరిస్తూ కోర్టు తన వైఖరిని స్పష్టం చేసింది. బుల్డోజర్లను రంగంలోకి దింపి సుమారు 100 ఎకరాల భూమిలో చెట్లను తొలగించడం ముఖ్యమైన ఆందోళన అని ధర్మాసనం స్పష్టం చేసింది.1996లో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చెట్టు కొట్టేసే ముందు పర్మిషన్ తీసుకున్నారా? లేదా? అని బిఆర్ గవాయ్ ప్రశ్నించారు. అనుమ తులు తీసుకున్నాకే ఆ భూముల్లో జామాయిల్ చెట్లు, కంప, పొదలను తొలగింపు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపు లాయర్ అభిషేక్ మను సింఘ్వీ కోర్టుకు వెల్లడించారు. రాష్ట్రంలో వాల్టా చట్టం అమల్లో ఉందని, ప్రభుత్వం దాని ప్రకారం చర్యలు తీసుకుందని అమికస్ క్యూరీ చెప్పారు. ఒకవేళ పర్మిషన్ లేకుండా చెట్లు తొలగించినట్లు అయితే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా కొందరు అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని గవాయ్ హెచ్చరించారు.
సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పనని ఘాటు వ్యాఖ్యల్ను చేశారు. కంచ గచ్చిబౌలి భూములను రూ.10 వేల కోట్లకు మార్టిగేజ్ చేశారని కేంద్ర సాధికార కమిటీ నివేదికలో చెప్పినట్లు అమికస్ క్యూరీ సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆ భూములను ప్రభుత్వం అమ్ముతుందా? మార్టిగేజ్ చేస్తున్నారా? అనేది తమకు అనవసరమని ధర్మాసనం చెప్పింది. ఆ వందల ఎకరాలలో చెట్లు కొట్టివేయడానికి ముందు పర్మిషన్ తీసుకున్నారా? లేదా? అనేది అసలు విషయమని బిఆర్ గవాయ్ పేర్కొన్నారు.ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఆ భూములపై స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించింది. మే 15 కు తదుపరి విచారణ వాయిదా వేస్తూ ఆ భూములలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది. 400 ఎకరాలు భూములకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇటీ వల విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం అవి అటవీ భూములా? అందులో జంతువులు ఉన్నాయా? అనే ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించిన కోర్టు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఆ 400 ఎక రాల ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది.

# పనికి మాలిన హార్వర్డ్

అయింది. హార్వర్డ్ ఎప్పుడూ జాతి విద్వేషకర ధోరణులకు పాల్పడుతూ వస్తోంది.సంకుచిత భావాల వారితో వర్శిటీని నింపుతున్నదని, ఫలితం కూడా ఈ విధంగానే ఉంటోందని చెప్పారు. హార్వర్డ్‌కు ఇంతవరకూ ఉన్న పన్నుల మినహాయింపు సౌకర్యాన్ని ఎత్తివేయడం జరుగుతుందని కూడా ట్రంప్ హెచ్చరించారు. కొన్ని నగరాల మేయర్ల నుంచి ఈ సంస్థకు అడ్డగోలుగా నిధులు అందుతున్నాయి. వీటి దుర్వినియోగం జరుగుతోందని విమర్శించారు. న్యూయార్క్, చికాగోల డెమొక్రాట్ మేయర్లు వామపక్ష భావజాలంతో వ్యవహరిస్తున్నారని, వీరి ధోరణి ప్రమాదకరంగా మారిందని విమర్శించారు. హార్వర్డ్ ఇటీవలి కాలంలో అగ్రశ్రేణి వర్శిటీల జాబితాలో ఎక్కడా కన్పించడం లేదని, వెనుకబడుతోందని, పైగా విద్వేషకర భావజాలానికి వేదిక అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విద్యాసంస్థ వ్యవహారం ఇప్పుడు ఓ జోక్‌గా మారింది. అందరికి షాకు ఇస్తోందని విమర్శించారు.
తమ విద్యాసంస్థపై ట్రంప్ చేసిన ఆరోపణలను దీని సారధి అలన్ గర్బర్ తోసిపుచ్చారు. ఇవి బెదిరింపులని, వీటిని తాము పట్టించుకునేది లేదని స్పష్టం చేశారు. వర్శిటీ బోధనా సిబ్బందికి, పౌరులకు ఓ లేఖ రాశారు. ఈ విద్యాసంస్థ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను ఎవరూ కాదనడానికి వీల్లేదని తెలిపారు. వైట్‌హౌస్ వర్గాల అధికారిక అతిక్రమణ చెల్లనేరదని హెచ్చరించారు.

# ఇడిపై కాంగ్రెస్ భగ్గు

/హైదరాబాద్: సిబిఐ, ఈ డీలను కేంద్ర ప్రభుత్వం తమ జేబు సంస్థల్లా వాడుకుంటోందని, కేవలం ప్రతిపక్షాల పై అక్రమ కేసులు పెట్టేందుకే ఈడీని బిజెపి ఉపయోగించుకుంటుందని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసిసి నేతలు రా హుల్ గాంధీ, సోనియా గాంధీ పేర్లను ఈ డీ చార్జిషీట్ లో చేర్చింది. దీనిపై కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చే స్తున్నారు. ఏఐసిసి పిలుపు మేరకు టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీ లో కాంగ్రెస్ నేతలు పెద్దఎత్తున పాల్గొన్నా రు. ఈ ర్యాలీలో పార్టీ నేతలకు మద్దతుగా, బిజెపి నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈసందర్భంగా హైదరాబాద్‌లో మహేష్‌గౌడ్ మీడియాతో మాట్లాడు తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్ర భు త్వం ఏర్పడి పదేళ్లు అవుతుందని, అప్పటి నుంచి దాదాపు 95 శాతం ఈడీ కేసులన్నీ ప్రతిపక్షాలపైనే పెడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. 2014 నుంచి నమోదైన ప్రతి 100 కేసుల్లో 95 కేసులు ప్రతిపక్షాలపైనే ఉంటున్నాయని,ప్రతిపక్షాల పేర్లు లేకుండా ఈడీ చార్జీ షీట్లు దాఖలు చేయడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోనియా, రాహుల్‌గాంధీలపై ఈడీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నిరసన కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చార్జిషీట్ దాఖలు చేయడం పట్ల నిరసన సూచకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం




దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కేసుకు 'బోగస్ కథనం' ఆధారమని కాంగ్రెస్ ఆరోపించింది. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్) డబ్బు గాని, ఆస్తి గాని గాంధీల నియంత్రణలోని యంగ్ ఇండియన్‌కు బదలీ కాలేదని పార్టీ స్పష్టం చేసింది. 'ప్రభుత్వ ప్రాయోజిత నేరానికి' వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రాష్ట్ర రాజధానులు, జిల్లా కేంద్రాల్లో ఇడి కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు.వారిలో అనేక మందిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. సచిన్ పైలట్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, గుర్దీప్ సప్పల్ వంటి సీనియర్ నేతలు ఢిల్లీలో ఎఐసిసి కార్యాలయంలో నిరసనలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థ) కెసి వేణుగోపాల్ 'ఎక్స్'లో నిరసనల చిత్రాలను పంచుకుంటూ, 'మోడీ భయపడినప్పుడు ఆయన ఇడిని ముందుకు తెస్తారు%డ% ఖర్గేజీ, రాహుల్‌జీ నాయకత్వంలో వృద్ధి చెందుతున్న, పునరుజ్జీవం పొందిన కాంగ్రెస్ పట్ల బిజెపి భయమే ఇటువంటి చర్యలకు పురికొల్పుతున్నది తప్ప వేరేమీ కాదు. మా నేతలకు దన్నుగా ఉంటాం. మున్ముందు రెట్టించిన ఉత్సాహంతో అన్ని బెదరింపు యత్నాలను అడ్డుకుంటాం' అని పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తాం:మంత్రి శ్రీధర్ బాబు

విషయం కోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై ఏమీ మాట్లాడలేమని పేర్కొన్నారు. నెమళ్లు జనావాసాల్లోకి రావడం సహజమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ నేతలు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనే కంచ గచ్చిబౌలి భూములపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. తమది కూలగొడితే కూలిపోయే ప్రభుత్వం కాదని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర పన్నుతున్నట్లుగా భావిస్తున్నామని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

## బంగారం..లకారం

న్యూఢిల్లీ: బంగారం ధరలు కొత్త ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. బుధవారం పది గ్రాముల పసిడి ధర రూ.98,000 మార్క్‌ను దాటింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.1,650 పెరిగి రూ.98,100 కి చేరుకుంది. మొత్తానికి పసిడి ధర లక్షకు చేరువ అవుతోంది. అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య యు ద్ధం పెరుగుతుండడంతో ప్రపంచ వ్యాప్తం గా బంగారం సురక్షితమై పెట్టుబడిగా భా వించి ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ ప్రకారం, మంగళవారం నాడు 99.9 శాతం స్వచ్ఛత 10 గ్రా ముల బంగారం ధర రూ.96,450 కి చేరుకుంది. అయితే ఈ నెల 11న ఒక్క రోజే పసిడి ధర దాదాపు రూ.6,250 పెరిగింది. బుధవారం పది గ్రాముల పసిడి ధర మరుసటి రోజు రూ.1,650 పెరిగి రూ. 97,650కి చేరుకుంది. ఎంసిఎక్స్ మార్కెట్ల లో జూన్ డెలివరీకి గోల్డ్ ఫ్యూచర్ రూ. 1,984 (2.12 శాతం) పెరిగి రూ. 95,435కి చేరుకుంది. ఎల్‌కెపి సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ విపి అనలిస్ట్ జతీన్ త్రివేది మాట్లాడుతూ, మరోసారి బం గారం ధర గణనీయమైన వృద్ధిని సాధించిం ది.సురక్షితమైన పెట్టుబడిగా భావించడంతో కామెక్స్ గోల్డ్ 3,300 డాలర్లను దాటిందని అన్నారు. మరోవైపు కిలో వెండి ధర రూ.1900 పెరిగి రూ.99,400 కి చేరుకుంది. మంగళవారం నాడు కిలో వెం డి ధర రూ.97,500 గా ఉంది. జనవరి 1 నుంచి చూస్తే బంగారం దాదాపు రూ. 18,710 (23.56 శాతం) పెరిగింది. జనవరిలో ఈ బంగారం పది గ్రాముల ధర రూ.79,390 గా ఉంది. అదే సమయంలో వెండి ధర కూడా రూ.10,558 పెరిగి కిలో కు రూ.86,017 నుంచి రూ.99,000కి చేరుకుంది. ఈ సంవత్సరం చివరి నాటికి బంగారం ధర రూ.1.10 లక్షలకు చేరుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అ మెరికా, చైనా మధ్య పెరుగుతున్న వాణి జ్య యుద్ధం, మాంద్యం భయాల కారణంగా ఈ సంవత్సరం బంగారం ఔన్సుకు 3,700 డాలర్లకు చేరుకోవచ్చు. విదేశీ పెట్టుబడి బ్యాంకు గోల్డ్‌న్ శాచ్స్ ఈ అంచనాను విడుదల చేసింది. అంతర్జాతీయ ధరల ప్రకారం లెక్కిస్తే, భారతదేశంలో 10 గ్రా. బంగారం ధర రూ.1.10 లక్షల వరకు పెరగవచ్చు.

## సిద్ధాంతాల పోరులో కాంగ్రెస్‌దే పైచేయి కాగలదు

ఒక్కొక్కదానికి కొత్త అధ్యక్షులను నియమించే ప్రక్రియను పర్యవేక్షిస్తుంది. మరిన్ని అధికారాలు దత్తం చేయడం, జిల్లా శాఖలకు నిధులు సమకూర్చడం, సీనియర్ నేతల పని తీరును మదింపు వేయడం, అట్టడుగు క్రియాశీలక కార్యకర్తలను ప్రమోట్ చేయడం, చురుకుగా లేని, లేక 'బిజెపి కోసం పని చేస్తున్న' నాయకులను తొలగించడం వంటి పలు వాగ్దానాలను రాహుల్ తన ప్రసంగంలో కార్యకర్తలకు చేశారు. 'ఇది సిద్ధాంతాల మధ్య సమరం. సిద్ధాంతాలు ఉన్న పార్టీలు రెండే ఉన్నాయి.ఒకటి బిజెపి, రెండవది కాంగ్రెస్. కాంగ్రెస్ మాత్రమే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను ఓడించగలదు. గుజరాత్ పార్టీకి ఎంతో ముఖ్యమైన రాష్ట్రం. ఎందుకంటే బిజెపి పరాజయానికి మార్గం గుజరాత్ మీదుగానే సాగుతుంది' అని ఆయన చెప్పారు. 'ఒక విధంగా గుజరాత్ నుంచి వచ్చిన పార్టీ మహొన్నత నేతలు మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ కారణంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ఉనికిలోకి వచ్చింది' అని రాహుల్ సభికులతో చెప్పారు. సుమారు మూడు దశాబ్దాలుగా గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలో లేనందున రాష్ట్రంలో పార్టీ శ్రేణులు 'నైతిక స్థైర్యం కోల్పోయారు' అని అంగీకరించిన రాహుల్ కాషాయ పార్టీని ఓడించడం కష్టం ఏమీ కాదని స్పష్టంచేశారు. 'ఇక్కడ బిజెపిని ఓడించడం కష్టమని మీరు భావిస్తుంటారు.
బిజెపిని ఓడించడం తేలిక అని, మనం కచ్చితంగా ఆ పని చేయగలమని మీతో చెప్పడానికే ఇక్కడిక వచ్చాను. పార్టీ పని తీరులో కొన్ని మార్పులు మనకు అవసరం. నాయకుల మధ్య విధ్వంసకర పోటీ, స్థానిక నాయకత్వాన్ని సంప్రదించకుండానే ఎన్నికల టిక్కెట్ల పంపిణీ వంటి కొన్ని సమస్యలను స్థానిక నాయకులు ప్రధానంగా ప్రస్తావించారు' అని ఆయన తెలిపారు. రేసు గుర్రాలు, పెళ్లి ఊరేగింపు గుర్రాలు, గాయపడిన గుర్రాలు అనే మూడు కేటగరీలుగా కాంగ్రెస్ నాయకులను రాహుల్ వర్గీకరించారు. గుజరాత్‌లో పార్టీ బాగా పని చేయడం లేదని, ఎందుకంటే రేసు గుర్రాలను 'పెళ్లిళ్లలో నాట్యంచేయిస్తున్నారు' అని, 'నాట్యం' కోసం ఉద్దేశించినవాటిని రేసు (ఎన్నికల పోరు)లో పాల్గొనవలసిందని కోరుతున్నారని ఆయన చెప్పారు. 'వారిని వేరు చేయవలసిన సమయం వచ్చింది.మేము రేసు గుర్రాలను (ఎన్నికల్లో) పరుగెత్తేలా, పెళ్లి గుర్రాలను (ఏ పనీ ఇవ్వకుండా) నాట్యం చేసేలా చేస్తాం. జిల్లా శాఖలు అహ్మదాబాద్ నుంచి కాకుండా జిల్లాల నుంచే పని చేయాలి. అందుకే జిల్లా అధ్యక్షులకు మరిన్ని అధికారాలు దత్తం చేసే ప్రక్రియను మేము ప్రారంభించాం' అని రాహుల్ తెలిపారు. ఐదుగురు సభ్యుల కమిటీ ప్రతి జిల్లాలో పార్టీ కార్యకర్తలను కలుసుకుని, జిల్లా అధ్యక్షులు కాగల ఐదు ఆరుగురు అభ్యర్థుల పేర్లను సంక్షిప్త జాబితాలో చేరుస్తారు. ఎంపికైన జిల్లా అధ్యక్షుడు 'పై నుంచి 'ఉత్తర్వులు లేదా ఎటువంటి జోక్యమూ లేకుండా జిల్లా శాఖ నిర్వహణకు నిర్ణయాలు తీసుకుంటారు' అని ఆయన వాగ్దానం చేశారు. 'పార్టీ యంత్రాంగం, పార్టీ అభ్యర్థుల మధ్య అనుసంధానం ఉండాలి. ఎన్నో సార్లు ఎన్నికల్లో గెలిచిన తరువాత ఎంఎల్ఎ తన విజయంలో ముఖ్య పాత్ర పోషించిన సంస్థ గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పుడు సంస్థే అభ్యర్థులను ఎంపిక చేస్తుంది.పై నుంచి ఎవ్వరూ అభ్యర్థుల గురించి నిర్ణయం తీసుకోబోరు' అని రాహుల్ చెప్పారు.

## సౌదీ ప్రభుత్వం షాకింగ్ నిర్ణయం

పిల్లలతో సహా హజ్ యాత్ర కు వెళ్ళాలనుకునే వారికి సౌదీ ప్రభుత్వం షాకింగ్ న్యూస్ చెప్పింది. 12 ఏళ్ళలోపు పిల్లలను హాజ్ యాత్రకు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా హజ్ యాత్రకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్న తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. రాష్ట్రం నుండి తల్లిదండ్రులతో కలిసి హజ్ యాత్రకు వెళ్తున్న 12 ఏళ్ల లోపు పిల్లల సంఖ్య 38 ఉంది. ఇప్పటికే వీరు హజ్ యాత్రకు సంబంధించి రుసుము చెల్లించి యాత్రకు సిద్ధమయ్యారు. చివరి నిముషంలో సౌదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరంతా తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. 38 మంది పిల్లల యాత్ర రద్దు కావడంత పాటు వారి తల్లిదండ్రులు కూడా తమ యాత్రను రద్దు చేసుకుంటున్నారు.చిన్న పిల్లలను వదిలి హజ్ యాత్రకు వెళ్లడం సాధ్యం కానందున తల్లిదండ్రులు ఇప్పటికే తమ యాత్రను రద్దు చేసుకున్నారు. 10 నుండి 12 ఏళ్ల వయస్సు ఉన్న కొంత మంది పిల్లల తల్లిదండ్రులు తమ బంధువుల వద్ద వారిని వదిలి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. చిన్న పిల్లలు మాత్రం తల్లిదండ్రులను వదిలి ఉండలేని పరిస్తితి ఉన్నందున తల్లిదండ్రులు కూడా తమ యాత్రను రద్దు చేసుకుంటున్నట్ల రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియా బాని తెలిపారు. వారు చెల్లించిన డబ్బులను తిరిగి చెల్లిస్తున్నట్లు తెలిపారు. సౌడీ ప్రభుత్వం పిల్లలను హజ్ యాత్రకు అనుమతించక పోవడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. యాత్ర రద్దు చేసుకున్న 12 ఏళ్ళ లోపు పిల్లల వివరాలను రాష్ట్ర హజ్ కమిటి వెల్లడించింది.మరోవైపు హజ్ యాత్రీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపా రాష్ట్ర హజ్ కమిటీ దృష్టి సారించింది. హజ్ యాత్ర ప్రారంభంతో పాటు సౌదీలో వారికి కల్పించాల్సిన ఏర్పాట్లు, ఇక్కడి నుండి బయలు దేరి యాత్ర పూర్తి చేసుకొని మళ్ళీ తిరిగి వచ్చే వరకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. అందులో బాగంగా బుధవారం చైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియాబానీ అధ్యక్షతన హజ్ కమిటీ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాసన సభ్యులు మొహమ్మద్ జాఫర్ హుస్సేన్ మెరాజ్, అజ్మతుల్లా హుస్సేనీ, ముజీబుద్దీన్, లయీఖ్, ఇల్యాస్ అహ్మద్ హమిద్ ఖాస్మి, షర్ఫుద్దీన్, ఖాజా సనా, డా. సయ్యద్ అజర్ అలీ, ఎగ్జిక్యూటివ్ అధికారి సజ్జాద్ అలీ, ఎఈఓ ఇర్ఫాన్ షరీఫ్, పాల్గొన్నారు. రాబోయే హజ్ క్యాంప్ కార్యకలాపాలకు సంబంధించిన సమస్యలు, ఏర్పాట్లు, పనులపై చర్చించారు. హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుండి బయలుదేరే హజ్ యాత్రికుల సంక్షేమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంపై ఈ సమావేశంలో సమీక్షించారు.

## సివిల్ వివాదంపై క్రిమినల్ కేసా.. ?

## పోలీసులకు సుప్రీం జరిమానా

న్యూఢిల్లీ : ఆస్తి వివాదానికి సంబంధించిన సివిల్ కేసును క్రిమినల్ కేసుగా మార్చి ఎఫ్ఐఆర్ దాఖలు చేసినందుకు సుప్రీం కోర్టు ఉత్తరప్రదేశ్ పోలీస్ అధికారులకు రూ.50,000 జరిమానా విధించింది. సివిల్ వివాదాలతో ఎఫ్ఐఆర్ నమోదును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్లు వెల్లువెత్తుతున్నాయని, ఇది నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆస్తి వివాదంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఆమోదయోగ్యం కాదని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. జరిమానాను మాఫీ చేయాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరగా అందుకు నిరాకరించింది.గతంలో ఇటువంటి కేసులో సివిల్ విషయాన్ని క్రిమినల్ కేసుగా మార్చడం ఆమోదయోగ్యం కాదని తెలిపినప్పటికీ పోలీసులు తమ పద్ధతి మార్చుకోవట్లేదని మండిపడింది. ఈ కేసులో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించింది.

## రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలు

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**- బొప్పాపూర్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**



సత్యమేవ జయతే – ఎల్లారెడ్డిపేట ఎల్లారెడ్డిపేట : రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పపూర్ లోని ఏఎంసీలో ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు బుధవారం ఏర్పాటు చేయగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేర బేగం గౌస్ తో కలిసి బుదవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.

రైతులు తాము పండించిన ధాన్యాన్నీ సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. సరైన తేమ శాతంతో ధాన్యాన్ని నిర్వాహకులు సేకరిస్తారని వివరించారు. కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాలని, డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం అమ్ముకోవడానికి వచ్చే రైతులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో ఐకెపి ఆధ్వర్యంలో మొత్తం 191 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రైతులకు ఐకెపి వారు ఉత్తమ సేవలు అందిస్తున్నారని వివరించారు. మిల్లర్లు ధాన్యం సేకరించకపోతే సమీపంలోని ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేస్తామని పేర్కొన్నారు.

ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేరా బేగం గౌస్ మాట్లాడుతూ దళారులకు వరి ధాన్యం అమ్మి రైతులు మోసపోవద్దని ఐకెపీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం ప్రకటించిన మద్దత్తు ధరను పొందాలని పిలుపునిచ్చారు,

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని పేద ప్రజల కోసం సన్నబియ్యం తో పాటు అనేక సంక్షేమ పథకాలు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు,

రైతులను మహిళా స్వశక్తి సంఘాల మహిళలను లక్షాధికారులను చేయడం కోసం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించడం జరిగిందని రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు చేపట్టాలని

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి అఫ్జలి బేగం, డీఆర్డీఓ శేషాద్రి, తహసిల్దార్ సుజాత బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మటే నరసయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రామ్ రెడ్డి డైరెక్టర్లు , కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఈదురుగాలులతో వానలు..

**15 జిల్లాలకు అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ**



సత్యమేవ జయతే – హైదరాబాద్

హైదరాబాద్ : తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే ఛాన్స్ ఉందని చెప్పింది. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు పడుతాయని తెలిపింది.

గురువారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. శు క్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

# ఆదిలాబాద్‌లో స్కూల్ పిల్లలపై విషప్రయోగం.. 30 మంది పిల్లలకు తప్పిన పెనుముప్పు




సత్యమేవ జయతే – ఆదిలాబాద్ ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విష ప్రయోగం జరిగింది. విద్యార్థులు తాగే నీటి ట్యాంక్‌లో దుండగులు పురుగుల మందు కలిపారు. మధ్యాహ్న భోజన సామగ్రిపై కూడా పురుగుల మందులు చల్లారు. బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో పాఠశాలలోని వంట గదికి సిబ్బంది తాళాలు వేసుకుని వెళ్లారు. సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన సిబ్బంది వంట చేసేందుకు పాత్రలు కడిగే సమయంలో దుర్వాసన, నురగలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పాఠశాల హెడ్ మాస్టర్, సిబ్బంది చుట్టుపక్కల చూడగా పురుగుల మందు డబ్బా కనిపించింది. అలాగే తాగు నీటి ట్యాంక్‌లోనూ పురుగుల మందు కలిపినట్లుగా సిబ్బంది గుర్తించారు. దీంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది.. విద్యార్థులను తాగునీటి కుళాయిల వైపు వెళ్లకుండా చూశారు. మధ్యాహ్న భోజనం వండలేదు. ఈ ఘటనపై ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సరైన సమయానికి పాఠశాల సిబ్బంది గుర్తించి మధ్యాహ్న భోజనం వండకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ధర్మపురి పాఠశాలలో దాదాపు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా విష ప్రయోగం నుంచి బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఈ ఘటనపై పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు మండిపడుతున్నారు. అసలు స్కూల్ పిల్లలపై విష ప్రయోగం చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని.. చిన్న పిల్లలు ఏం పాపం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# 120 ఫీట్ల పొడవు.. 80 ఫీట్ల వెడల్పు.. సిద్ధమవుతున్న రజతోత్సవ వేదిక

సత్యమేవ జయతే – హనుమకొండ హనుమకొండ : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. భారీ బహిరంగ సభల నిర్వహణలో రికార్డులున్న బీఆర్ఎస్.. ఎల్కతుర్తి సభను అదే స్థాయిలో నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నది. లక్షలాది మంది ప్రజలు, తెలంగాణవాదులు, బీఆర్ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు హాజరయ్యే రజతోత్సవ మహాసభ వేదిక నిర్మాణం మొదలైంది. 120 ఫీట్ల పొడవు, 80 ఫీట్ల వెడల్పుతో వేదిక ఏర్పాటవుతున్నది. వేదిక నిర్మాణం కోసం కంకర పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు 50 వేల వాహనాల్లో లక్షలాది మంది ఈ సభకు వస్తారనే అంచనా ఉండటంతో అందుకు అనుగుణంగా 1,213 ఎకరాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. 154 ఎకరాల్లో సభా ప్రాంగణం, 1,059 ఎకరాల్లో పార్కింగ్ వసతులు ఏర్పాటు చేస్తున్నారు. మహాసభ ప్రాంగణం మొత్తం చదును చేశారు. సిద్దిపేట, వరంగల్, కరీంనగర్ నుంచి జాతీయ రహదారి జంక్షన్‌గా ఎల్కతుర్తి రజతోత్సవ సభకు అనువుగా ఉన్నది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అనుసంధానమయ్యేలా ఎల్కతుర్తి నుంచి జాతీయ రహదారులు ఉన్నాయి. రజతోత్సవ సభ ఏర్పాట్లతో ఎల్కతుర్తి కొత్త కళను సంతరించుకున్నది. నెల రోజుల్లోనే గుర్తుపట్టలేనంతగా ఎల్కతుర్తిలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు అభివృద్ధి అయ్యాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు, సూచనలతో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు ఆధ్వర్యంలో మహాసభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా సభ%ా

%తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా నిలిచిన బీఆర్ఎస్ 25 ఏండ్ల ఉద్యమ, అభివృద్ధి, రాజకీయ ప్రస్థానాన్ని వివరిస్తూనే%ా% రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుపై భరోసానిచ్చేలా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఉంటుందని గులాబీ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ఏడాదిన్నరగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని అంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ, ముఖ్యంగా రైతులు, పేదలు ఆర్థికంగా సాధికారత వైపుగా అడుగులు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో ఏడాదిన్నరగా సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో రాష్ట్ర పురోగతి మందగించింది. ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఆగమవుతున్నది. ఈ నేపథ్యంలో అన్ని వర్గాలకు అండగా నిలిచేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఉంటుందని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా 2001 ఏప్రిల్‌లో ఆవిర్భవించిన బీఆర్ఎస్ అలుపెరుగని ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన విషయం విదితమే. 2014 నుంచి పదేండ్ల సుపరిపాలనతో తెలంగాణను బీఆర్ఎస్ దేశంలో అగ్రగామిగా నిలిపింది. రాష్ట్ర సాధన ఉద్యమం, 10 ఏండ్ల సుపరిపాలన కలయికగా ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ జరగనున్నది.



# రూ.500కే గ్యాస్‌కు మంగళం?

**మూన్నాళ్ల ముచ్చటగా గ్యారెంటీ స్కీం**

**- 6 నెలలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమకాని సబ్సిడీ పైసలు**

**- గ్యాస్ ఏజెన్సీలు, ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న మహిళలు**

సత్యమేవ జయతే – హైదరాబాద్

హైదరాబాద్ : ఆరు గ్యారెంటీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆరు నెలలుగా లబ్ధిదారుల ఖాతాల్లో రాయితీ డబ్బులు జమకావడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు.. గ్యాస్ ఏజెన్సీలు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అధికారులను అడిగితే తమకేమీ తెలియదని చెప్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 27న రూ.500కే సిలిండర్ పథకానికి శ్రీకారం చుట్టింది. తెల్ల రేషన్‌కార్డులు ఉన్నవారందరికీ వర్తింపజేస్తామని ఘనంగా ప్రకటించింది. మహిళల పేరిట ఉన్న కనెక్షన్లకు మాత్రమే పథకం వర్తిస్తుందని చెప్పడంతో సుమారు 58 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో నిబంధల పేరిట సుమారు 13.9 లక్షల మందిని తొలగించి 44.1 లక్షల మందిని అర్హులుగా తేల్చారు. తొలుత రెండు, మూడు నెలలపాటు ఆయిల్ కంపెనీలకు రాయితీ డబ్బులు ఇస్తామని, తర్వాత నేరుగా అబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తామని చెప్పారు. ఆరేడు నెలలపాటు సక్రమంగానే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రాయితీ డబ్బులను జమచేశారు. అయితే, గత సంవత్సరం నవంబర్ నుంచి గ్యాస్ సబ్సిడీ నగదు అందడంలేదని మహిళలు వాపోతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు, ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ కట్టెల పొయ్యే దిక్కు



నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటుండటం, సబ్సిడీ గ్యాస్ స్కీం నిలిచిపోవడంతో పలువురు గ్రామీణ మహిళలు గ్యాస్ సిలిండర్‌ను అటకెక్కిస్తున్నారు. వంట కోసం కట్టెల పొయ్యిపై ఆధారపడుతున్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ రూ.500కే సిలిండర్ ఇస్తామని అబద్ధాలు చెప్పిందని మండిపడుతున్నారు. గద్దెనెక్కిన తర్వాత ఖజానాలో డబ్బులు లేవని చెప్పి తప్పించుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఒక్కసారే రూ.300 జమయినయ్

ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుందని చెప్తే మస్తు సంతోషపడ్డం. ఈ ఏడాదిలో నాలుగు సిలిండర్లు తీసుకున్నం. కానీ, మొదటిసారి మాత్రమే సబ్సిడీ కింద రూ.300 మా ఖాతాలో జమైనయ్. ఆ తరువాత పడలేదు. మండల కేంద్రంలో ఉన్న గ్యాస్ ఆఫీసుకు పోయి అడిగితే మండలాఫీసుకు వెళ్లమన్నరు. అక్కడికి పోయి అడిగితే మాకు తెల్వదు అంటున్నరు. ప్రభుత్వం గిట్ల జేయడం మంచిపద్ధతి కాదు. ఇచ్చిన మాట ప్రకారం రూ.500కే సిలిండర్ ఇవ్వాలె.

%–% మద్దెల స్వప్న, కోలనూరు గ్రామం, ఓదెల మండలం, పెద్దపల్లి జిల్లా

మోసం చేస్తే తడాఖా చూపెడుతం

ఎన్నికల టైంలో మా పార్టీకి ఓటేస్తే రూ.500కే సిలిండర్ వస్తుందని కాంగ్రెస్ నాయకులు నమ్మబలికిన్రు. మొదట్లో రెండు, మూడు సిలిండర్లు తీసుకున్నప్పుడు ఖాతాలో రూ.300 చొప్పున జమయినయ్. కానీ, ఆరేడు నెలల సంధి ఒక్క రూపాయి కూడా పడతలేవు. నాకే గాదు మా ఊర్లో చాలామందికి సబ్సిడీ పైసలు పడతలేవు అంటున్నరు. బ్యాంకులు, ఆఫీసులకెళ్లి అడిగితే మాకు తెల్వదని చెప్తున్నరు. కాంగ్రెస్ ఇచ్చిన మాట మేరకు పథకాన్ని అమలుచేయాలి. మమ్మల్ని మోసం చేస్తే మళ్లా ఓట్ల టైంలో మా తడాఖా చూపెడుతం.

%–% కారెంగుల స్వరూప, ఓదెల, పెద్దపల్లి జిల్లా

# జూనియర్ కాలేజీలకు మంగళం?

**కొత్తగా ఏర్పాటయ్యే పబ్లిక్ స్కూళ్లలో కలిపేసే యోచన**

**- సర్కారుకు సిఫారసు చేసిన తెలంగాణ విద్యా కమిషన్**

**- ప్రతి మండలంలో 3 పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదన**

**- సిఫారసులను వ్యతిరేకిస్తున్న అధ్యాపక సంఘాలు**



సత్యమేవ జయతే - హైదరాబాద్

హైదరాబాద్ : రాష్ట్రంలో గ్రామీణ, నిరుపేద విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కనుమరుగు కానున్నాయా? 50 ఏండ్లకు పైబడిన కాలేజీలు కాలగర్భంలో కలువనున్నాయా? అంటే పరిస్థితి చూస్తే అవుననే అనిపిస్తున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఎత్తివేయాలని 'తెలంగాణ విద్యాకమిషన్' ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కొత్తగా ఏర్పాటుచేసే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో విలీనం చేయాలని ప్రతిపాదించింది. ఈ మేరకు ఇటీవలే కమిషన్ సర్కారుకు నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో ప్రతి మండలంలో మూడు పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటుచేయాలని, వీటిలోనే నర్సరీ నుంచి ఇంటర్ వరకు నిర్వహించాలని సూచించింది. ఒక్కో పబ్లిక్ స్కూల్‌ను 1,500 మంది విద్యార్థులతో నిర్వహించాలన్నది. పదో తరగతి విద్యార్థులకు టీసీలు లేకుండా ఇంటర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించాలని సిఫారసు చేసింది. ఒకే ప్రాంగణంలోని ల్యాబ్‌లు, ఆటస్థలం, డైనింగ్ హాళ్లను ఉమ్మడిగా వాడుకునేలా చూడాలని సర్కారుకు సూచించింది.

సక్సెస్‌కు చిరునామా ఇంటర్ విద్య..

1969-70లో పీవీ నర్సింహారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి విజయవంతంగా నడుస్తున్నది. ఒక రకంగా చెప్పాలంటే ఇంటర్ విద్య సక్సెస్‌కు కేరాఫ్ అడ్రస్ అయ్యింది. నేడు ఐఐటీలు, ఎన్ఐటీల్లో 15-20 శాతం మన విద్యార్థులున్నారంటే అందుకు ఇంటర్ విద్యావ్యవస్థే కారణం. మెడికల్ సీట్లను అత్యధికులు పొందుతుండడం కూడా ఇంటర్ విద్యతోనే. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులు ఎంతో ప్రయోజకులవుతున్నారు.

అధ్యాపక సంఘాల ఆగ్రహం..

రాష్ట్రంలో ప్రస్తుతం 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో దాదాపు 1.6 లక్షల మంది విద్యార్థులున్నారు. ఇవన్నీ దాదాపు మండల కేంద్రాల్లోనే ఉన్నాయి. వీటిల్లో విద్యార్థులకు ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నారు. విద్యార్థుల నుంచి కేవలం పరీక్ష ఫీజు మాత్రమే తీసుకుంటున్న కాలేజీలను ఎత్తివేయాలని విద్యాకమిషన్ సిఫారసు చేయడం గమనార్హం. విద్యాకమిషన్ సిఫారసులను ఇంటర్ అధ్యాపక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కమిషన్ సిఫారసులను సర్కారు అమలుచేస్తే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నాయి. లక్షల ఫీజుతో దోపిడీ చేస్తున్న కార్పొరేట్ కాలేజీలను అదుపుచేయడంపై విద్యాకమిషన్ ఎందుకు దృష్టిసారించడం లేదని ప్రశ్నిస్తున్నాయి.

తలెత్తనున్న సమస్యలు..

ఇంటర్ అకడమిక్ క్యాలెండర్, పాఠశాల విద్య అకడమిక్ క్యాలెండర్ వేర్వేరుగా ఉంటాయి. సమన్వయం ఎలా చేస్తారు?

ఒక పబ్లిక్ స్కూల్‌లో 1,500 మంది విద్యార్థులు ఉండాలని కమిషన్ సూచించింది. ఇంతమంది ఒకేసారి మధ్యాహ్న భోజనం చేయగలరా? ఇంత మంది ఒకేసారి వాడుకునే స్థాయిలో టాయిలెట్లు ఉంటాయా?

దాదాపు అన్ని సర్కారు జూనియర్ కాలేజీలకు సొంత భవనాలు, స్థలాలు ఉన్నాయి. వాటిని ఏంచేస్తారు?

పబ్లిక్ స్కూళ్లను మండలాల్లోనే ఏర్పాటుచేయనుండటంతో కొన్ని కాలేజీలను విలీనం చేసి మరికొన్నింటిని చేయకపోతే సమస్యలు తలెత్తవా?

కాలేజీలు, స్కూళ్లకు వేర్వేరు పర్యవేక్షణాధికారులుగా డీఐఈవో, డీఈవో ఉంటారు. ఒకే క్యాంపస్‌లో ఉన్న వాటిని ఎవరు తనిఖీ చేయాలి?

60 ఏండ్లు వెనక్కి తీసుకెళ్లడమే

ప్రభుత్వ జూనియర్ కాలేజీను తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో విలీనం చేయాలనడం ఆత్మహత్యా సదృశ్యం. ఇలాంటి ప్రతిపాదనలతో విద్యావ్యవస్థను 60 ఏండ్లు వెనక్కి తీసుకెళ్లడమే అవుతుంది. ఇంటర్ విద్యతోనే మన పిల్లలు జేఈఈ, నీట్‌లో రాణిస్తున్నారు. ఎంబీబీఎస్, ఐఐటీ సీట్లు పొందుతున్నారు. ఈ కాలేజీలను బలోపేతం చేసేలా విద్యాకమిషన్ సిఫారసులు ఉంటాయనుకున్నాం. ప్రైవేట్ కాలేజీల ఆగడాలను అరికడతాయనుకున్నాం. కానీ, సర్కారు కాలేజీలకు ఉరి బిగించేలా ఉండటం ఆందోళనరం.

%-% డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్

సిఫారసులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

ఇంటర్ విద్యను నాశనం చేసేలా విద్యా కమిషన్ సిఫారసులున్నాయి. ఈ సిఫారసులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. కొత్త సర్కారు కాలేజీల కోసం అనేక ప్రాంతాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ఇటీవల పెద్దఎత్తున కొత్త కాలేజీలు ఏర్పాటుచేశారు. సర్కారు జూనియర్, గురుకుల కాలేజీలు కలిపితే ప్రైవేట్ కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇవి విజయవంతంగా నడుస్తున్నాయి. ఇలాంటి కాలేజీలను పబ్లిక్ స్కూళ్లలో విలీనం చేయాలనుకోవడం దారుణం.

%-%

జంగయ్య, ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

# అడుగడుగునా ఉల్లంఘనలే.. ఫిలింనగర్‌లో బీజేపీ నేత అక్రమనిర్మాణాలు



సత్యమేవ జయతే - హైదరాబాద్

హైదరాబాద్ : జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేవు.. పేదలకు కేటాయించిన వాంబే గృహాలను కొనుగోలు చేసేందుకు వీలులేకున్నా అడ్డదారిలో కొనుగోలు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఏకంగా ఆరంతస్థుల్లో భవన నిర్మాణం.. అక్రమ నిర్మాణాన్ని కూల్చేయాలని హైకోర్టులో ఆదేశాలు. అయినా జీహెచ్ఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. ఏకంగా రాష్ట్ర శాసనసభలో సైతం ఈ అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే లేవనెత్తినా ఇప్పటివరకూ చర్యలు తీసుకోకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది.

వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట మండలం ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్‌లో బంజారాహిల్స్ డివిజన్‌కు చెందిన బీజేపీ నేత హెచ్.వెంకట్‌రెడ్డి గత కొంతకాలంగా సుమారు 180 గజాల్లో 6 అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఈ స్థలంలో గతంలో పేదల కోసం (బీపీఎల్) వాంబే ఇండ్లు ఉండేవి. ఎస్సీ, బీసీలకు చెందిన పేదలకు గత ప్రభుత్వాల హాయంలో ఇచ్చిన ఇండ్లను బీజేపీ నేత వెంకట్‌రెడ్డి అక్రమంగా కొనుగోలు చేయడంతో పాటు ఈ స్థలంలో సుమారు 60 గజాలను జీవో 59 కింద తన భార్య నర్మద పేరుతో క్రమబద్ధీకరణ చేయించుకున్నారు. రెవెన్యూ నిబంధనల ప్రకారం వాంబే గృహాలను లబ్దిదారుల కుటుంబాలు మాత్రమే ఉపయోగించుకోవాలి తప్ప వేరేవారికి అమ్మరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. అయినా తప్పుడు సమాచారం ఇచ్చి 60 గజాలను జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయించుకున్న వెంకట్‌రెడ్డి మిగిలిన స్థలాన్ని కలుపుకుని ఇటీవల బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు.

దీంతో బస్తీవాసులు జీహెచ్ఎంసీకి, షేక్‌పేట మండల తహసీల్దార్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులకు ముడుపులు చెల్లించి అక్రమ నిర్మాణాలను ఉపేక్షిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాటు ఇటీవల స్థానికంగా నివాసం ఉంటున్న కొంతమంది వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించగా వెంటనే అక్రమ నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం కూల్చివేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో జీహెచ్ఎంసీ సర్కిల్-18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వెంకట్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే నిర్మాణదారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో 15 రోజుల్లోగా కూల్చివేతలు చేపడతామని స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేశారు. అయితే అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కిన నిర్మాణదారులు పనులు కొనసాగిస్తున్నారు. ఆదేశాలు జారీ చేసి రెండునెలలు గడిచినప్పటికీ ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల వ్యవహారశైలిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేదవాడు చిన్నతప్పు చేస్తే జేసీబీలతో విరుచుకుపడే జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు రాజకీయనాయకులు చేస్తున్న అక్రమాలపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారుల తీరుపై ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం ప్రస్తావించడం గమనార్హం. ఇదిలా ఉండగా మొత్తం స్థలంలో 60గజాలను జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయించుకున్న వెంకట్‌రెడ్డి మరో 120 గజాల స్థలాన్ని లబ్దిదారులనుంచి అక్రమంగా తీసుకున్నట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలింది. ఇప్పటికే షేక్‌పేట మండల రెవెన్యూ సిబ్బంది ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. సదరు స్థలంలోని బిల్డింగ్‌ను సీజ్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఫిలింనగర్‌తో పాటు బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్‌బీటీనగర్‌లో సైతం వెంకట్‌రెడ్డి ఇదే విధంగా ఎస్సీలకు చెందిన స్థలాలను అడ్డదారిలో క్రమబద్ధీకరణ చేయించుకున్నారని, కోర్టుల్లో కేసులు

# సీఈసీ నియామక చట్టంపై పిటిషన్లు.. మే 14న విచారణ జరుపుతామన్న సుప్రీంకోర్టు..




సత్యమేవ జయతే - న్యూఢిల్లీ

న్యూఢిల్లీ : సీఈసీ, ఈసీల నియామక చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సుప్రీంకోర్టు తేదీని నిర్ణయించింది. అన్ని పిటిషన్లపై మే 14న విచారించనున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ఓ పిటిషన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. ఈ విషయంలో త్వరగా విచారణ జరపాలని సర్వోన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం వచ్చే నెలలో విచారణకు తేదీని నిర్ణయించింది. భూసేకరణతో పాటు అనేక ఇతర కీలకమైన కేసులను ఈ రోజు ధర్మాసనం విచారిస్తుందని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. అయితే, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ 2023లో కేంద్రం చట్టాన్ని తీసుకువచ్చింది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా ఆమోదం పొందింది. అయితే, కమిటీ నుంచి సుప్రీంకోర్టు సీజేఐని తొలగించి కేంద్ర న్యాయశాఖ మంత్రికి చోటు కల్పించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్జీవో అయిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరఫున ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టులో హాజరయ్యారు. ఎన్నికల కమిషనర్లను ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన స్వతంత్ర కమిటీ నియమించాలని ఆయన గతంలో కోర్టును కోరారు. అలాకాకుండా ప్రభుత్వమే నియమిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సుప్రీంకోర్టు 2023లో ఇచ్చిన తీర్పు హెచ్చరించిందని.. కానీ, ఆ కమిటీలో ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ మంత్రికి చోటిస్తూ కేంద్రం కొత్త చట్టం తెచ్చిందన్నారు. చట్టాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్‌తో పాటు పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

# ధరణి పోర్టల్ బ్లాక్!

## నిలిచిపోయిన సేవలు

**- భూభారతితోపాటు ధరణి కూడా పని చేస్తుందని ప్రభుత్వ ప్రకటన**

**- ఆ మరుసటి రోజే నిలిచిపోవడంపై అనుమానాలు**

సత్యమేవ జయతే - హైదరాబాద్

హైదరాబాద్ : ధరణి పోర్టల్ పనిచేయడంలేదు. మంగళవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధరణి సేవలు నిలిచిపోయాయి. దీంతో భూ క్రయ, విక్రయాలకు అంతరాయం ఏర్పడింది. నిజానికి, కొత్తగా తీసుకొచ్చిన భూభారతి పోర్టల్ పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చే వరకు ధరణి వెబ్‌సైట్ కూడా పని చేస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇందుకు విరుద్ధంగా ధరణి వెబ్‌సైట్ నిలిచిపోయింది. ధరణి, భూ భారతి పోర్టల్‌లు వేరువేరు అయినప్పటికీ, అర్ధాంతరంగా ధరణి సేవలు బంద్ కావడంపై రెవెన్యూ వర్గాల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధరణి పోర్టల్ నిలిచిపోవడానికి సాంకేతిక కారణాలే కారణమా? లేక రహస్య ఎజెండా ఏమైనా ఉన్నదా? అనే అనుమానాలను పలువురు వ ృ క ్ త ం % ే % చ ే స ్ త ు న ్ న ా ర ు . భూభారతి వెనుక ఉన్న పలువురు కీలక వ్యక్తులు కావాలనే ధరణి పోర్టల్‌ను బ్లాక్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. భూభారతి పోర్టల్ ప్రారంభం కావడంతో పలు భూములకు సంబంధించిన 'లెక్కలు' సరి చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ధరణి పోర్టల్ సేవలను నిలిపేసి అందులోని భూ లెక్కలను 'సరి చేస్తున్నట్టుగా' ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భూభారతి పైలట్ ప్రాజెక్టును ముగ్గురు కీలక మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటు భూభారతి అమల్లోకి రావడం, అటు ధరణి పోర్టల్ బంద్ కావడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎందుకు పని చేయడం లేదు?

వ్యవసాయ భూములకు సంబంధించి ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూభారతిని అమల్లోకి తీసుకొచ్చింది. ప్రస్తుతానికి భూభారతి కేవలం నాలుగు మండలాల్లో మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్నది. ఈ నేపథ్యంలో వ్యవసాయ భూముల క్రయ, విక్రయాలకు ఎలాంటి ఇబ్బంది రావొద్దనే ఉద్దేశంతో ఆ నాలుగు మండలాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ధరణి సేవలు యథాప్రకారం కొనసాగుతాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే, ఆ మరుసటి రోజే ధరణి పోర్టల్ నిలిచిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి ప్రకటించిన తర్వాత కూడా ధరణి సేవలు ఎందుకు నిలిచిపోయాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ధరణి పోర్టల్ వేరు. భూభారతి పోర్టల్ వేరు. అలాంటప్పుడు ధరణి పోర్టల్‌కు ఎందుకు అంతరాయం కలిగిందనేది ప్రశ్న. ధరణి పోర్టల్ సేవలు నిలిచిపోవడంపై రెవెన్యూ శాఖ నుంచి ఎటువంటి ప్రకటనా వెలువడలేదు.

%ళి3:46ాపీ, 4/16/2025ఠి% ం91 91213 73951: ఎండ్

# డబుల్ ఇండ్లకు చేరకుంటే రద్దు!

## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో లబ్ధిదారులకు రెండుసార్లు నోటీసులు జారీ

**- మరోసారి నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామంటున్న అధికారులు**






సత్యమేవ జయతే - మేడ్చల్-మల్కాజిగిరి

మేడ్చల్-మల్కాజిగిరి : కేటాయించిన డబుల్‌బెడ్ రూమ్‌లలో లబ్ధిదారులు చేరకుంటే రద్దుకు చర్యలు తీసుకోనున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉన్న డబుల్‌బెడ్ రూమ్‌ల లబ్ధిదారులకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. ఈనెల 20లోపు మరోసారి నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్‌లను ఇండ్లు లేని వారిని గుర్తించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రేటర్ పరిధిలోని వారికి అందించింది. జిల్లాలోని బండ్లగూడ, రాంపల్లి, జవహర్‌నగర్ పరిధిలోని అహ్మద్‌గూడ, తూంకుంట, శామీర్‌పేట్ మండలం మురహరిపల్లి, ప్రతాపసింగారం, కొర్రెముల, దుండిగల్‌లో వేలాది సంఖ్యలో డబుల్‌బెడ్ రూమ్‌లను నిర్మించి అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్‌లను కేటాయిస్తూ సర్టిఫికెట్లు అందించారు.

ఖాళీగా వేలాది ఇండ్లు ..

లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించినా వేలాది సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో 6,203 డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించగా.. 1500 మంది లబ్ధిదారులు మాత్రమే చేరగా, మరో 4,500 ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో ఇక్కడే ఖాళీగా ఉన్నాయి. ప్రతాపసింగారంలో 2వేల మంది లబ్ధిదారులకు..1100 మంది లబ్ధిదారులు మాత్రమే చేరారు. మరో 900 ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. తూంకుంట మండలం మురహరిపల్లిలో 2,200 మంది, దుండిగల్‌లో 396 మంది, కొర్రెములలో 30 మంది లబ్ధిదారులు డబుల్‌బెడ్ రూమ్‌లలో చేరాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తలుపులు, కిటికిలు విరిగిపోతున్నాయని, దీంతో ఇబ్బందులు వస్తున్న క్రమంలో ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్‌లను ఖాళీగా ఉంచకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ప్రజాపాలనలో ఇండ్ల కోసం అనేక దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో డబుల్ ఇండ్లలో చేరిని వారి గుర్తింపును రద్దు చేసి ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారికి అందించేల చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రద్దు చేస్తామని నోటీసు బోర్డు

జీహెచ్ఎంసీ డబుల్‌బెడ్ రూమ్ లబ్ధిదారులకు మంజూరు చేసిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను ఈనెల 20వ తేదీ లోపు వచ్చి నివసించకుంటే మీకు ఇల్లు అవసరం లేదని భాంచి రద్దు చేయుటకు అధికారులకు సిఫారసు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ బోర్డును ఏర్పాటు చేసింది

# డబుల్ బెడ్రూం ఇళ్లలోకి వస్తారా? రద్దు చేయమంటారా?

## మేడ్చల్ జిల్లాలో అధికారుల నోటీసులు

సత్యమేవ జయతే - మేడ్చల్
మేడ్చల్ : డబుల్ బెడ్రూం ఇండ్లు పొంది.. వాటిలో చేరకుండా ఉన్న లబ్ధిదారులపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. తక్షణమే డబుల్ బెడ్రూం ఇండ్లలోకి రాకపోతే వాటిని రద్దు చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు ఇప్పటికే రెండు సార్లు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీలోపు మరోసారి నోటీసులు ఇచ్చి డబుల్ బెడ్రూం రద్దుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఇండ్లు లేని వారిని అప్పట్లో గుర్తించిన బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి గ్రేటర్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించింది. జిల్లాలోని బండ్లగూడ, రాంపల్లి, జవహర్‌నగర్ పరిధిలోని ఆహ్మద్‌గూడ, తూంకుంట, శామీర్‌పేట మండలం మురహరిపల్లి, ప్రతాప సింగారం, కొర్రెముల, దుండిగల్‌లో వేలాది సంఖ్యలో డబుల్‌బెడ్ రూమ్‌లను నిర్మించి అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్‌ల ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌లను అందించారు. అయితే లబ్ధిదారులు డబుల్ బెడ్రూం ఇండ్లలోకి చేరకపోవడంతో చాలావరకు ఖాళీగా ఉన్నాయి.

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో 6, 203 డబుల్ బెడ్రూంలు ఉండగా.. అందులో 1500 మంది లబ్ధిదారులు మాత్రమే చేరారు. మిగతా 4500 డబుల్ బెడ్రూంలు ఖాళీగా ఉన్నాయి. ఇక ప్రతాప సింగారంలో 2 వేల మంది లబ్ధిదారులకు గానూ 1100 మంది మాత్రమే చేరారు. తూంకుంట మండలం మురహరిపల్లిలో 2,200 మంది, దుండిగల్‌లో 396 మంది, కొర్రెములలో 30 మంది లబ్ధిదారులు డబుల్‌బెడ్ రూమ్‌లలో చేరాల్సి ఉంది. డబుల్ బెడ్రూంలు ఖాళీగా ఉండటంతో తలుపులు, కిటికీలు విరిగిపోతున్నాయని, దీంతో ఇబ్బందులు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే కేటాయించిన డబుల్ బెడ్రూంలను ఖాళీగా ఉంచకుండా చర్యలు తీసుకుంటున్నట్లు



అధికారులు తెలిపారు. కాగా, కేటాయించిన డబుల్ బెడ్రూంల్లోకి లబ్ధిదారులు ఈ నెల 20వ తేదీలోపు వచ్చి చేరకుంటే.. వారికి ఇల్లు అవసరం లేదని భావించి, రద్దు చేయాలని అధికారులకు సిఫారసు చేస్తామని ఇప్పటికే జీహెచ్ఎంసీ బోర్డు కూడా ఏర్పాటు చేయడం గమనార్హం.

# భూములకు పట్టా పాస్ బుక్స్ ఇవ్వండి.

**భూములకు పట్టా పాస్ బుక్స్ ఇవ్వండి.**

**బి గతంలో ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు.**

**బి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా, %జూవీ% పార్టీ మద్దతు.**




సత్యమేవ జయతే న్యూస్/ నర్సాపూర్‌ొల్చారం మండలం కొంగోడు గ్రామం సర్వే నంబర్ 209 లో గత 70 సంవత్సరలుగా తాతలు, తండ్రులు కబ్జాలో ఉన్న రెవెన్యూ భూమికి పట్టా పాస్ బుక్స్ కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ధర్నాకు %జూవీ% పార్టీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు మాట్లాడుతూ గతంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటాలు చేసిన పోరాటాలకు అధికారులు స్పందించి 2012 సంవత్సరంలో సర్వే చేసి పట్టా పాస్ బుక్స్ ఇస్తామని హామీ ఇచ్చిన నేటివరకు ఒక్కరికి కూడా పాస్ బుక్ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు 70 సంవత్సరలా నుండి కబ్జాలో ఉన్న భూమికి పాస్ బుక్స్ కావాలని 2002 నుండి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేయడంతో 7 మంది పై కేసులు కూడా పెట్టారని గుర్తుచేశారు. 209 సర్వే నంబర్ లో 93.13 ఎకరాల భూమి ఉందని అందులో గ్రామానికి చెందిన 110 కుటుంబాలు వ్యవసాయం చేస్తు సంవత్సరనికి రెండు పంటలు తీస్తున్నారని గుర్తుచేశారు. అధికారులు సర్వే చేసినప్పటికే 8 టన్స్ ఫారలు, 28 బోర్లతో రైతులు వ్యవసాయం చేస్తున్నారని వారు తెలిపారు. 2012 సంవత్సరలో రెవిన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికారులు కలిసి సర్వే నిర్వహించి పట్టా సర్టిఫికెట్స్ ఇస్తామని చెప్పిన నేటివరకు ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. సర్వే అనంతరం 24 మంది పేర్లు మాత్రమే నిర్ణయిస్తూ మండల రెవెన్యూ అధికారులు తెలిపిన అందులో 4 మంది కబ్జాలో లేకున్నా ప్రతిపదించడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందాన్నారు. ఇప్పటికైనా రైతులు కాస్తులో, కబ్జాలో ఉన్న భూములకు పట్టా పాస్ బుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఆర్డీఓ మాట్లాడుతూ నిజమైన రెవెన్యూ భూమి ఐతే తప్పకుండ ప్రభుత్వం చెప్తున్నట్లు మీకు పాస్ బుకులు వచ్చేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు. భూ భారతి ఈ మధ్యలోనే వచ్చిందని 2,3 నెలలు తర్వాత కచ్చితంగా సర్వే చేసి అర్హులకు పాస్ బుక్స్ వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమం లో ఏసు, స్వామి, దుర్గయ్య, దాసు, మధు, పోచయ్య, అనసూజా, సంతోష, కమలమ్మ, నిర్మల, పోచమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య రాకుండా నూతన డెడికేటెడ్ లైన్ ను ప్రారంభించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు





సత్యమేవజయతేబినారాయణఖేడ్ఆందోల్ నియోజకవర్గంలోని వట్ పల్లి మండల పరిధిలోనీ గొర్రెకల్ గ్రామంలో గల సబ్ స్టేషన్ సపరేట్ డెడికేట్ లైను 70 లక్షల రూపాయలతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క మరియు జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో ఈరోజు గొర్రెకల్ సబ్ స్టేషన్ లో డెడికేటెడ్ లైను ప్రారంభించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనంతరం వారు మాట్లాడుతూ ఇంతకుముందు గొర్రెకల్ దగ్గర ఉన్న పంప్ హౌస్ దగ్గర లో ఓల్టేజ్ కారణంగా పంప్ హౌస్ లోని మోటర్లు పాడవడం జరిగింది దానివలన మన నారాయణఖేడ్ నియోజకవర్గానికి నీటి సమస్య ఉండేదని అలాగే కంగ్టీ మండలానికి గొర్రెకల్ పంప్ హౌస్ దగ్గర ఒక్కసారి మోటర్లు పాడైతే మోటార్ బాగు చేసి నీరు కంగ్టి వరకు రావడానికి రెండు రోజుల సమయం పట్టేదని ఈ సపరేట్ డెడికేటెడ్ లైన్ ద్వారా లోవోల్టేజ్ సమస్య తీరి మన నారాయణఖేడ్ నియోజకవర్గానికి నీటి సమస్య లేకుండా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి మరియు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకి అడగగానే 70 లక్షల రూపాయలను మంజూరు చేసినందుకు గాను మా నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజల తరపున మంత్రికి ధన్యవాదాలు తెలిపారు ఈ డెడికేటెడ్ లైన్ వలన విద్యుత్ సమస్య ఏర్పడకుండా మోటర్లు పాడవకుండా ఉండడానికి మరియు నారాయణఖేడ్ నియోజకవర్గం లోని మిషన్ భగీరథ నీటి సరఫరా వేగవంతంగా జరుగుతుందని జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు డిఈ తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు

# భూ భారతి పేరొక్కటే మారింది..

## మిగతాదంతా సేమ్ టు సేమ్ ధరణిలాగే!

సత్యమేవ జయతే - హైదరాబాద్
హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కారు కొత్తగా తీసుకొచ్చిన భూభారతి చట్టం 'పాత సీసాలో కొత్త సారా..' లాగానే ఉన్నది. రైతుల భూముల పరిరక్షణే లక్ష్యంగా బీఆర్ఎస్ సర్కారు తీసుకొచ్చిన ధరణిని తిట్టిపోసిన కాంగ్రెస్‌కు, ఇప్పుడు ఆ ధరణి మార్గదర్శకాలే దిక్కయ్యాయి. నాడు ధరణిలో పొందుపరిచిన అంశాలనే భూభారతిలో యథాతథంగా ఎత్తిపోసింది. 33 మాడ్యూల్స్‌ను ఆరుకు తగ్గించామంటూ గొప్పగా ప్రకటించింది. ఇందులోనూ మాయ చేసింది. ప్రస్తుతం ఉన్న 33 మాడ్యూల్స్‌లోని వివిధ అంశాలన్నింటిని కలిపేసి ఆరు మాడ్యూల్స్‌లో పొందుపరిచింది. అన్నీ కలిపేసి మాడ్యూల్స్ తగ్గించామంటూ ప్రకటించేసింది. ఇందులో ఒకటి రెండు మినహా కాంగ్రెస్ సర్కారు కొత్తగా చేసిందేమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భూభారతి అమలుకు సంబంధించి రెవెన్యూ శాఖకు చెం దిన ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ.. 'ధరణి పేరు మాత్రమే మారింది. అంతా సేమ్ టు సేమ్' అని కీలక వ్యాఖ్యలు చేశారు.

కొత్తదనం లేని భూభారతి

కాంగ్రెస్ సర్కారు ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన భూభారతిలో కొత్తదనం కరువైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకటి రెండు మార్పులు తప్ప పూర్తిగా ధరణిని దించేశారనే అభిప్రాయాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా కొన్ని అంశాలు ఇప్పట్లో అమలు చేసే అవకాశం లేకపోయినప్పటికీ ఇందులో పొందుపరిచి అమలు చేస్తున్నట్టుగా చెప్పుకోవడం గమనార్హం.

అందులోని కొన్ని అంశాలను పరిశీలిస్తే%ా

%కేసీఆర్ సర్కారు అమల్లోకి తీసుకొచ్చిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని భూభారతిలోనూ అమలు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మ్యుటేషన్ కూడా పూర్తవుతుంది. ధరణిలోనూ ఇదే విధానం అమల్లో ఉండేది.

ఫౌతీ(వారసత్వ) భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మ్యుటేషన్‌కు 30 రోజుల విచారణ గడువు విధించారు. అయితే ధరణిలో గడువుకు బదులుగా రిజిస్ట్రేషన్ సమయంలోనే కుటుంబ సభ్యుల ఆమోద పత్రం తీసుకునేవారు.

భూభారతి చట్టం వ్యవసాయ, వ్యవసాయేతర, ఆబాదీ భూములకు వర్తిస్తుంది. ధరణిలో కూడా ఇదే విధంగా ఉండేది. కానీ, హైకోర్టు ఆదేశాలతో వ్యవసాయేతర భూ ముల సేవల్ని నిలిపేశారు. ఇప్పుడు భూభారతిలోనూ వ్యవసాయ భూముల సేవలే అందుతున్నాయి. వ్యవసాయేతర భూములపై స్పష్టత లేదు.

భూములకు భూధార్ పేరుతో నెంబర్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇది ఎప్పటి నుంచి అమలు చేస్తారనే విషయాన్ని వెల్లడించలేదు.

భూభారతి ప్రకారం యాజమాన్య హక్కు ల నిర్ధారణ కోసం సివిల్ కోర్టును ఆశ్రయించాలి. గతంలో ధరణిలోనూ ఇదే నిబంధన ఉండేది.

భూభారతి ప్రకారం భూ సమస్యలపై అప్పీలేట్ అథారిటీని ఏర్పాటు చేశారు. ఎంఆర్వో, ఆర్డీవో, కలెక్టర్లకు పరిష్కార బాధ్యతలను అప్పగించారు. గతంలో ధరణిలో కలెక్టర్‌కు మాత్రమే ఈ అధికారం ఉండేది.

ఇక పాత భూసమస్యల పరిష్కారానికి ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని సర్కారు ప్రకటించింది. కానీ, ఎప్పటి నుంచి వీటిని ప్రారంభిస్తారనేది వెల్లడించలేదు. ధరణిలోనూ ట్రిబ్యునల్స్ ఏర్పాటు అంశం పొందుపరిచారు.

ప్రతి రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేశారు. కానీ, సర్వేయర్లను నియమించలేదు. దీంతో సర్వే మ్యాప్‌పై గందరగోళం నెలకొన్నది.

రైతులపై ఫీజుల మోత

భూభారతి చట్టం పేరుతో సర్కారు ఫీజుల మోత మోగించనున్నది. మ్యుటేషన్ కోసం ఎకరాకు రూ.2,500 వసూలు చేయనున్నది. కొత్త పాస్ పుస్తకం కోసం రూ.300 చెల్లించాల్సిందే. ఇక కాంగ్రెస్ సర్కారు కొత్తగా తెచ్చిన రికార్డు మార్పులు, ఇతర అప్పీళ్ల కోసం రూ.1,000 ఫీజు సమర్పించుకోవాల్సిందే. అమలుకు ఆలస్యమెందుకు?

భూభారతి అంతా సవ్యంగా ఉంటే.. పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, ఎం దుకు ఆసల్యం చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తొలుత నాలుగు మండలాల్లో మాత్రమే అమలు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే అప్పటినుంచైనా పూర్తిస్థాయిలో అమలు చేస్తారా, లేదా? అనే సందేహాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల పాటు అవగాహన సదస్సులు పెట్టాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. దీంతోపాటు గత డిసెంబర్‌లో సర్కారు అసెంబ్లీలో భూభారతి చట్టం చేసింది. తాజాగా పోర్టల్‌ను ప్రారంభించడంతోపాటు మార్గదర్శకాలు విడుదల చేసింది. అంటే చట్టం చేసిన తర్వాత నాలుగు నెలలు అమలులో ఎందుకు జాప్యం చేసిందనే ప్రశ్న వినిపిస్తున్నది. అదేవిధంగా గ్రామస్థాయిలో రెవె న్యూ సేవలు అందించేందుకు 10,954 మంది గ్రామ పాలన అధికారులను(జీపీవో) నియమిస్తామని సర్కారు ప్రకటించింది. కానీ, వీరి నియామకం పూర్తి కాకుండానే పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నది.

అమలుకు ఆలస్యమెందుకు?

అస్తవ్యస్తంగా ఉన్న ధరణిని బంగాళాఖాతంలో కలిపి రైతులకు మేలు చేసేందుకు భూ వివాదాలు లేని తెలంగాణ కోసం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్టు కాంగ్రెస్ సర్కారు గొప్పగా ప్రకటించింది. అయితే సర్కారు పెద్దలు చెప్పే మాటలకు.. చేసే పనులకు పొంతన లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూభారతి అంతా సవ్యంగా ఉంటే.. పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, ఎందుకు ఆసల్యం చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తొలుత నాలుగు మండలాల్లో మాత్రమే అమలు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిం దే. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే అప్పటినుంచైనా పూర్తిస్థాయిలో అమలు చేస్తారా, లేదా? అనే సందేహాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

# ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే




సత్యమేవజయతేబినారాయణఖేడ్కల్హేర్ మండలం బిబిపేట్ గ్రామానికి చెందిన (టీచర్)గుండు నారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రామ్ సింగ్, మాజీ జడ్పిటిసి గుండు మోహన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# హైడ్రో గంజాయి విక్రయిదారుల ముఠా అరెస్ట్

**హైడ్రో గంజాయి విక్రయిదారుల ముఠా అరెస్ట్**

**- గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులు నుండి 7.5 లక్షల విలువైన 500 గ్రాముల హైడ్రో గంజాయి స్వాధీనం**

**- నిందితుల వద్ద నుంచి మూడు చరవాణీలు స్వాధీనం**

**- గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్**



సత్యమేవ జయతే – గుంటూరు గుంటూరు : గంజాయి ముఠా ను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న గ్రామీణ పోలీసులు సిఐ వై శ్రీనివాసరావు, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ లను అభినందించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్
గంజాయి విక్రయించిన సేవించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైడ్రో గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితులలో ఒకరు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా, మరో ఇద్దరూ విశాఖపట్నం చెందిన వారిగా దర్యాప్తులో తెలిసిందని, నిందితులు సంక్రాంతి నేపథ్యంలో పరిచయం పెరిగి బెంగళూరు వెళ్లి హైడ్రో గంజాయి సేవించి విక్రయించేందుకు తీసుకువస్తుండగా పక్కా సమాచారం మేరకు రంగంలోకి దిగిన మంగళగిరి రూరల్ పోలీసులు కాజా టోల్ ప్లాజా వద్ద నిఘా వేసిన సీఐ శ్రీనివాసరావు, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ లు గంజాయి విక్రయిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసలై సులభంగా డబ్బు సంపాదించవచ్చునని బెంగళూరు లో ఉంటున్న ఒక వ్యక్తితో కలిసి అతని వద్ద హైడ్రో గంజాయి ఉన్న దాన్ని తెలుసుకొని దానికి మార్కెట్లో డిమాండ్ ఉండడంతో అధిక ధరకు విక్రయించవచ్చునని అత్యాశతో నిందితులు 500 గ్రాముల హైడ్రో గంజాయిని కొనుగోలు చేసి ఏలూరుకు తీసుకువస్తూ మార్గం మధ్యలో కాజా టోల్ ప్లాజా విక్రయిస్తుండగా గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక్కొక్క గ్రాము గంజాయి 700 కొని 1500కు విక్రయిస్తున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు, హైడ్రో గంజాయి గురు నిందితులను అదుపులోకి తీసుకుంటున్నట్లు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఆయన తెలిపారు.గంజాయి ముఠా ను చాకచక్యంగా పట్టుకున్న మంగళగిరి రూరల్ సిఐ వై శ్రీనివాసరావు, ఎస్సై చిరుమామిళ్ల వెంకట లను సిబ్బందినీ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

# దళిత మహిళ మల్లేశ్వరి ప్రేమ హత్యకు కారణమైన కుక్కల జాన్ రెడ్డి ని వెంటనే ఉరిశిక్ష వేయాలి

**- ప్రియుడు మోసం చేశాడని విషం తాగి దళిత మహిళ యువతి మల్లేశ్వరి ఆత్మహత్య**

**- స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్**




సత్యమేవ జయతే – హనుమకొండ హనుమకొండ : స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్క ముంతలపహాడ్ గ్రామనికి చెందిన దళిత మహిళ మల్లేశ్వరి నీ ప్రియుడు జాన్ రెడ్డి పోయింది తనను మోసం చేశాడని ఆవేదనతో ఆమె కుమిలిపోయింది తనను ప్రేమించమని చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనకు తెలియకుండా మరో యువతిని వివాహం చేసుకున్నాడని మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడింది మృతురాలు ధర్మారపు మల్లేశ్వరి 27 ఏళ్ల దళిత యువతి ఈమె సరూర్నగర్ లోని హాస్టల్లో ఉంటూ హైదరాబాదులోని నిమ్స్ స్టాఫ్ నర్స్ గా పని చేస్తుంది. అయితే బొక్క ముంతల పహాడ్ గ్రామానికి చెందిన కుక్కల జాన్ రెడ్డి అనే యువకుడు హైదరాబాదులోనే ఓ రిహాబిలేషన్ సెంటర్లో పనిచేస్తున్నాడు. మల్లేశ్వరి మరియు జాన్ రెడ్డి కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు మల్లేశ్వరికి చెప్పకుండా జాన్ రెడ్డి మరో వివాహాన్ని చేసుకున్నాడు ఇది తెలిసి యువతి డిప్రెషన్ లోకి వెళ్లిన మల్లేశ్వరి సోమవారం తెల్లవారుజామున హాస్టల్లోని మరుగుదొడ్డిలోకి వెళ్లి విషం తాగి ఆత్మహత్య చేసుకుంది లోపల నుంచి ఆమె ఇంతవరకు బయటకి రాకపోవడంతో తన స్నేహితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు వారు వచ్చి మరుగుదొడ్డి తలుపులను పగలగొట్టి మల్లేశ్వరి ఆసుపత్రికి తరలించారు అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు మల్లేశ్వరి తల్లిదండ్రులు ధర్మారపు కోటమ్మ, పాపయ్య ,సోదరుడు శివకుమార్ బంధువులు హైదరాబాదుకు చేరుకొని పోస్టుమార్టం అనంతరం మల్లేశ్వరి మృతి దేహాన్ని సోమవారం రాత్రికి స్వగ్రామానికి తీసుకొచ్చారు మృతి దేహంతో సోమవారం రోజంతా మంగళవారం ఉదయం దాకా జాన్ రెడ్డి ఇంటి ఎదుట ఆందోళన నిర్వహించారు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల దాకా కోదాడ-జడ్చర్ల హైవేపై ఆందోళన చేశారు పోలీసులు అక్కడికి చేరుకొని మల్లేశ్వరి కుటుంబాలకు నచ్చజెప్పి మల్లేశ్వరి మృతికి కారణమైన వారిపై పూర్తి స్థాయి విచారణ నిర్వహిస్తామని నిందితులను కఠిన శిక్షిస్తామని హామీ ఇచ్చారు ఇవ్వడంతో ఆందోళన విరమించి కాగా జాన్ రెడ్డిని సరూర్నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు మల్లేశ్వరి సూసైడ్ నోట్ సైతం సరూర్నగర్ పోలీస్ స్టేషన్ లభించుకున్నట్టు తెలిసింది కానీ ఇలాంటి రెడ్డి అహంకారంతో ఉన్నటువంటి జాన్ రెడ్డిని ఉరిశిక్ష వేసి కులాంతర వివాహాలకు ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరుగుతా ఉంది అదేవిధంగా ఇలాంటి వ్యక్తులపై అతి తొందర్లో చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరుగుతా ఉంది అదే విధంగా ధర్మారపు మల్లేశ్వరి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొని వారికి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో చెట్టుపల్లి శివకుమార్, శ్రావణ్, ముత్తు,తేజశ్రీ ,హరీష, కార్తీక, మహేశ్వరి, స్వాతి ,స్వేత, శృతి ,పూజ ,రోజా, కల్పన ,ప్రణతి, శ్రావన్య, కల్పన, స్వప్న ,నాగేశ్వరి, అంజలి ,శ్రీ చరణ్ ,అరవింద్ ,మణికంఠ ,ఆసిఫ్ ,సునీల్ ,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మీ పిల్లల్లో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచాలంటే ఈ ఆహారాలను రోజూ తినిపించండి..!



సత్యమేవ జయతే – ఆరోగ్య చిట్కాలు

సీజన్లు మారినప్పుడల్లా సహజంగానే చాలా మందికి దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తుంటాయి. చిన్నారులకు అయితే తరచూ ఈ సమస్యలు వస్తాయి. ఎల్లప్పుడూ వారు జలుబుతో ఇబ్బంది పడుతుంటారు. అయితే వారు తీసుకునే ఆహారంలో మార్పులు చేస్తే దాంతో వారి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాని వల్ల వారికి దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలు రాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచితే వారికి ఎలాంటి రోగాలు రాకుండా చూడవచచు. అందుకు గాను పలు ఆహారాలను తరచూ ఇవ్వాల్సి ఉంటుంది. వాటితో ఇమ్యూనిటీ పెరగడమే కాదు, వారి శరీరానికి కావల్సిన పోషకాలు, శక్తి కూడా లభిస్తాయి. ఇక చిన్నారుల్లో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచే ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**సిట్రస్ పండ్లు..**

సిట్రస్ జాతికి చెందిన పండ్లను ఇస్తుంటే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. నారింజ, నిమ్మ, గ్రేప్ ఫ్రూట్ వంటి పండ్లను వారికి ఇస్తుండాలి. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అలాగే స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీలను కూడా ఇవ్వవచ్చు. వీటిల్లో విటమిన్ సి తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి పిల్లల్లో ఇమ్యూనిటీని పెంచుతాయి. ఆకుపచ్చని కూరగాయలు లేదా ఆకుకూరలను కూడా పిల్లలకు పెడుతుండాలి. పాలకూర, బ్రోకలీ వంటి కూరగాయల్లో విటమిన్లు ఎ, సి, ఇ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. చిలగడదుంపలలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఈ ఆహారాలను పిల్లలకు తినిపిస్తే వారిలో రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు.

**కోడిగుడ్లు..**

కోడిగుడ్లలో ప్రోటీన్లతోపాటు విటమిన్ ఎ, బి12 సెలీనియం అధికంగా ఉంటాయి. జింక్ కూడా పుష్కలంగానే ఉంటుంది. కోడిగుడ్లను రోజుకు ఒకటి చొప్పున పిల్లలకు ఇస్తుండాలి. ఇవి వారిలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. చికెన్, చేపల్లోనూ ప్రోటీన్లు, జింక్ ఎక్కువగానే ఉంటాయి. ఇవి కూడా ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతాయి. తరచూ వీటిని పిల్లలకు ఆహారంలో పెడుతుండాలి. బాదంపప్పు, వాల్ నట్స్ వంటి నట్స్‌తోపాటు చియా సీడ్స్, పొద్దు తిరుగుడు విత్తనాలు వంటి విత్తనాలను కూడా పిల్లలకు పెట్టాలి. వీటిల్లో విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి చిన్నారుల ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతాయి. రోగాలు రాకుండా చూస్తాయి.

**పెరుగు..**

పెరుగు మంచి ప్రొ బయోటిక్ ఆహారం. దీన్ని పిల్లలకు రోజూ పెట్టాలి. కొందరు పిల్లలు పెరుగు తినేందుకు ఇష్టపడరు. అలాంటప్పుడు నేరుగా దాన్ని పెట్టకుండా అందులో కాస్త చక్కెర లేదా పండ్ల ముక్కలు కలిపి ఇవ్వాలి. దీంతో వారు పెరుగును ఇష్టంగా తింటారు. పెరుగు జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ఇది పిల్లల్లో జీర్ణ సమస్యలు రాకుండా చూస్తుంది. వెల్లుల్లి, అల్లం వంటి ఆహారాలను కూడా పిల్లలకు ఇస్తుండాలి. వీటిల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను పిల్లలకు పెట్టడం వల్ల వారిలో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచవచ్చు. వారిలో వ్యాధులు రాకుండా చూడవచ్చు. ఆరోగ్యంగా ఉంటారు.

(నోట్ : ఇంటర్నెట్‌లో మరియు పుస్తకాల ఆధారంగా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు 'సత్యమేవ జయతే' బాధ్యత వహించదు.)

## వివాహ వేడుకల్లో పాల్గొన్న డిసిసి ప్రధాన కార్యదర్శి



సత్యమేవజయతేబిమనూర్‌మనూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామ ఆప్తులు రాయిపల్లి భూమన్న కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొనీ వధూవరులను ఆశీర్వదించిన డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి వారితో పాటు ఈశ్వరప్ప, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకాశ్ రావు పాటిల్ , అఖిలేష్ రెడ్డి, అశోక్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## వర్చువల్ గా నైని బొగ్గు గని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రజా పాలనలో ఇతర రాష్ట్రాలకు సింగరేణి విస్తరణ**

**ఒడిశా లో సింగరేణి గని ఏర్పాటు.. యావత్తు తెలంగాణకే గర్వకారణం**

**13 దశాబ్దాల సింగరేణి చరిత్రలో నైనీ గని ప్రారంభం ఒక సువర్ణాధ్యాయం**

ఒడిశా లో నైనీ గనిని వర్చువల్ గా ప్రారంభించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖామంత్రి భట్టి విక్రమార్కమల్లు

సత్యమేవ జయతే – కొత్తగూడెం కొత్తగూడెం : సింగరేణి విశ్వవ్యాప్త విస్తరణకు నైనీ గని




తొలిమెట్టు

సింగరేణి సంస్థ తన 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించుకోవడం ఒక సువర్ణ అధ్యాయమని, ఒడిశా రాష్ట్రంలో నైనీ గని ప్రారంభంతో సింగరేణి తన విశ్వవ్యాప్త విస్తరణకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్కమల్లు పేర్కొన్నారు. బుధవారం మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజా భవన్ నుంచి ఆయన ఒడిశా రాష్ట్రంలో సింగరేణి చేపట్టిన నైనీ బొగ్గు బ్లాక్ ను వర్చువల్ గా ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో గని ప్రారంభించడం సింగరేణి సంస్థ కే కాకుండా యావత్తు తెలంగాణ రాష్ట్రానికి ఒక ఆనందకరమైన సందర్భం అన్నారు. ఈ బొగ్గు బ్లాక్ను సింగరేణి కి కేటాయించి తొమ్మిది ఏళ్ళు అయినప్పటికీ వివిధ రకాల అనుమతులు అందడంలో జాప్యం వల్ల ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఏడాది క్రితం ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, తాను కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని పలుమార్లు కలిసి పూర్తి అనుమతులకు సానుకూలత సాధించామన్నారు. ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ వల్లే ఏడాదిలోనే దీనిని ప్రారంభించుకోవడం ప్రజా ప్రభుత్వానికి సింగరేణి అభివృద్ధిపై ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని పేర్కొన్నారు.

నేడు ఒడిశాలో ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకు సింగరేణి విస్తరణలో ఒక తొలి అడుగు గా ఆయన అభివర్ణించారు. ఇక్కడి నుండి ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు కూడా సింగరేణి విస్తరిస్తుందన్నారు. త్వరలో సింగరేణి గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నైనీ గని ప్రారంభానికి సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి శ్రీ కిషన్ రెడ్డికి, ఒడిశా ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీకి, స్థానిక ఎమ్మెల్యే అగస్థీ బెహరా, ఇతర ప్రజాప్రతినిధులకు తన ధన్యవాదాలు తెలిపారు.

అంగూల్ అభివృద్ధి కి పూర్తి కృషి...

గత ఏడాది జులైలో తన ఒడిశా పర్యటన సందర్భంగా అంగూల్ ప్రాంత అభివృద్ధికి తాను ఇచ్చిన ప్రతీ హామీని త్వరలోనే సింగరేణి సంస్థ అమలు జరుపుతుందని, ఆ ప్రాంత సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ అని, కేవలం వాణిజ్యం కోసం పనిచేసే కంపెనీ కాదని, సామాజిక స్పృహతో ఇక్కడ కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చారు.

అంగూల్ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగుపరచడం కోసం 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా నైనీ కి సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన స్థల సేకరణకు ఒడిశా ప్రభుత్వం సహకరించాల్సిందిగా కోరారు. ఇతర రాష్ట్రంలో తొలిసారిగా బొగ్గు తవ్వకం ప్రారంభించిన సింగరేణి, ఈ గనిని ఆదర్శప్రాయంగా నిర్వహించాలని కోరారు.

తెలంగాణ ప్రజలందరి తరఫున, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి తరఫున ఒడిశా రాష్ట్ర యావత్ ప్రజానీకానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ సందీప్ కుమార్ సుల్తానియా ఒడిశాలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఒక చరిత్రాత్మక సందర్భమని, ఇది సింగరేణి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

నైనీ బొగ్గు గని వద్ద జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీ అగస్తి బెహరా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ తమ ప్రాంతంలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ గనికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అంగూల్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కి, సింగరేణి సీఎండీకి తన శు భాకాంక్షలు తెలియజేశారు.

నైనీ నుంచి ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించిన సింగరేణి సంస్థ సీఎండీ శ్రీ ఎన్ బలరామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు చూపిన ప్రత్యేక చొరవ, సహకారం వలన నైనీ బొగ్గు బ్లాక్ ను ఈ రోజు ప్రారంభించుకో గలిగామన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో థర్మల్ పవర్ ప్లాంట్ను కూడా ప్రారంభిస్తామని, మరిన్ని అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలను విజయవంతంగా చేపడతామన్నారు.

కార్యక్రమంలో ప్రజా భవన్ నుంచి ట్రాన్స్ కో సీఎండీ శ్రీ కృష్ణ భాస్కర్, ఓఎస్డీ శ్రీ సురేందర్ రెడ్డి, సింగరేణి ఈడీ(కోల్ మూమెంట్) శ్రీ ఎస్డి.ఎం.సుభానీ పాల్గొనగా.. నైనీ నుంచిసంస్థ డైరెక్టర్లు శ్రీ ఎల్వీ సూర్యనారాయణ, శ్రీ కె.వెంకటేశ్వర్లు, నైనీ జీఎం శ్రీ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మీ ఊపిరితిత్తులు సేఫ్‌గా ఉండాలంటే తరచూ ఈ ఆహారాలను తినండి



సత్యమేవ జయతే - ఆరోగ్య చిట్కాలు ఆరోగ్యకరమైన ఆహారాలను తింటేనే మన శరీరంలోని అన్ని అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. పోషణ సరిగ్గా లభిస్తుంది. రోగాలు రాకుండా ఉంటాయి. ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూసుకోవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారాల్లో పండ్లు మొదటి స్థానంలో నిలుస్తాయి. కూరగాయలు కూడా ఆరోగ్యకరమైన ఆహారాలే అని చెప్పవచ్చు. ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను కూడా తినాలి. అప్పుడే శరీరంలోని అన్ని అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. అయితే ఊపిరితిత్తుల ఆరోగ్యం కోసం ప్రత్యేకమైన డైట్‌ను పాటించాలి. తరచూ దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తున్నవారు లేదా కఫం అధికంగా ఉన్నవారు, ఊపిరితిత్తులకు చెందిన సమస్యలను ఎదుర్కొంటున్న వారు ప్రత్యేకమైన డైట్‌ను పాటిస్తే ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అందుకు ఎలాంటి ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

యాంటీ ఆక్సిడెంట్లు ముఖ్యం..

యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను తింటే శరీరంలో వాపులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఆకుపచ్చని కూరగాయలు, బెర్రీలు, చేపలు, నట్స్ వంటి ఆహారాలను తినాలి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అలాగే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. ఇవి వాపులను తగ్గిస్తాయి. ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతాయి. తరచూ ఈ ఆహారాలను తింటుంటే ఊపిరితిత్తుల్లో ఉండే కఫం పోతుంది. దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఆకుకూరలను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వాపులను తగ్గించి ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి.

నట్స్, గింజలు..

బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలు, ఇతర బెర్రీ పండ్లలోనూ యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తులు డ్యామేజ్ అవకుండా చూస్తాయి. ఊపిరితిత్తుల కణజాలం రక్షించబడుతుంది. దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఊపిరితిత్తుల్లో ఉండే వాపు తగ్గుతుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. బాదంపప్పు, వాల్ నట్స్, అవిసె గింజలు, చియా విత్తనాలలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ప్రోటీన్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. యాపిల్స్, పియర్స్ వంటి పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌ను తగ్గిస్తాయి. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

బీట్ రూట్..

బీట్‌రూట్‌లో నైట్రేట్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల పనితీరును మెరుగు పరుస్తాయి. రక్త సరఫరాను పెంచుతాయి. దీంతో ఊపిరితిత్తులు ఆక్సిజన్‌ను తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. టమాటాల్లో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది శ్వాసనాళాల్లో ఉండే అడ్డంకులను తొలగిస్తుంది. ఊపిరితిత్తులు మెరుగ్గా పనిచేసేలా చేస్తుంది. దీంతో దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే వెల్లుల్లి, పసుపు కూడా ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఊపిరితిత్తుల్లో ఉండే కఫాన్ని తొలగించి ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను తరచూ తింటుంటే ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. (నోట్ : ఇంటర్నెట్‌లో మరియు పుస్తకాల ఆధారంగా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు 'సత్యమేవ జయతే' బాధ్యత వహించదు.)

## కేశ ఖండన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు



సత్యమేవజయతేబినారాయణఖేడ్ నారాయణఖేడ్ మండలం బాణాపూర్ గ్రామానికి చెందిన మచ్కూరి అంజయ్య మనుమరాలు పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు ఉమేష్ పాటిల్, నాని, సాయి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## యువత వ్యాపార రంగంలో రాణించాలని పట్టుదలతో ముందుకు సాగాలి:

### వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అర్ధ.సుధాకర్ రెడ్డి.



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా........ వికారాబాద్ మున్సిపల్ లో పరిధిలో లోని రాజీవ్ గృహ కల్ప సమీపంలో పోలీస్ స్టేషన్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఇట్స్ టీ టైమ్ హోటల్ ను రిబ్బన్ కాట్ చేసి ప్రారంభించిన వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు . అర్ధ. సుధాకర్ రెడ్డి . మరియు సుధాకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు జైదుపల్లి. మురళి, రెడ్యా నాయక్,వేణు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్,అసిఫ్, రహీం, చింతల. శేఖర్, ప్రవీణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు

## కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే:

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే టీ .రాంమోహన్ రెడ్డి.





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక రైల్వే స్టేషన్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం ముందు బిజెపి కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నేషనల్ హెరాల్డ్ కు సంబంధించి ఈడీ అక్రమంగా ఛార్జి షీట్ ను కాంగ్రెస్ పార్టీ అధినేత్రి శ్రీమతి.సోనియాగాంధీ గారిపై మరియు కాంగ్రెస్ అగ్ర నేత శ్రీ రాహుల్ గాంధీ గారి పై ఫైల్ చేసినందుకుగాను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కుట్రపూరితంగా భారత్ జోడోయాత్ర ద్వారా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన శ్రీ రాహుల్ గాంధీ వచ్చిన ప్రజాదరణను చూసి రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని భయంతో ఇలాంటి అక్రమ కేసులకు పాల్పడి వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నందున డిసిసి అధ్యక్షులు , పరిగి శాసనసభ్యులు టీ. రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా వికారాబాద్ మండల పార్టీ అధ్యక్షులు .బి. రాజశేఖర్ రెడ్డి పరిగి పట్టణ అధ్యక్షులు కృష్ణ గారు. పూడూర్ మండల పార్టీ అధ్యక్షులు. సురేందర్ ముదిరాజ్ . వికారాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సామ రామచంద్ర రెడ్డి వికారాబాద్ టౌన్ ఎస్ సి సెల్ అధ్యక్షులు బక్క యాదగిరి. శ్రీనివాస్ ముదిరాజ్. రమేష్ బుచ్చయ్య సి నరేందర్ బి శ్రీనివాస్ మరియు జిల్లా ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## త్వరలో తాండూరుకు మరో మూడు డీసీసీబీ బ్యాంకులు ప్రారంభిస్తాం - ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి...





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.. యాలాల్ మండలం లక్ష్మీ నారాయణపూర్ గ్రామంలో ది హైదరాబాద్ జిల్లా సహకర కేంద్ర. బ్యాంకు( లక్ష్మీనారాయణపూర్ నూతన శాఖ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.

రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ..

గతంలో డీసీసీబీ బ్యాంకులు పట్టణాలకే పరిమితం అయ్యేవి. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మారుమూల గ్రామాల రైతులకు లబ్దిచేకూర్చాలని నాబార్డ్ వారిని సంప్రదించి, లక్ష్మీనారాయణపూర్ కు బ్యాంకు తీసుకురావడం జరిగింది...

తాండూరులో రైతుల డిమాండ్ మేరకు త్వరలో మండలానికి ఒకటి చొప్పున డీసీసీబీ బ్యాంకును ప్రారంభించే విధంగా కృషి చేస్తాం.

బ్యాంకు సబ్సిడీ ద్వారా వ్యాపారాలు, వ్యవసాయ అభివృద్ధికి, రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. రైతులు ప్రైవేటు బ్యాంకులను సంప్రదించకుండా, డీసీసీబీ బ్యాంకులను సద్వినియోగం చేసుకొవాలి. రైస్, దాల్ మిల్లులు నిర్మించుకునే వారికి సబ్సిడీ ఋణాలు అందిస్తాం.. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సత్యయ్య గ డీసీసీబీ డైరెక్టర్ లు, సొసైటీ చైర్మన్ లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, ప్రజాప్రతినిధులు నాయకులు, అధికారులు ఉన్నారు..

## పోలీసు స్టేషన్ లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.






**స్టేషన్ రికార్డులు, హిస్టరీ షీట్స్ ఎలాంటి పెండింగ్ లేకుండా చూసుకోవాలి..**

**కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా ఆన్లైన్ బెట్టింగ్స్, సైబర్ ఫ్రాడ్స్ గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి..**

**యస్.హెచ్.ఒ వీలైనంత ఎక్కువ సమయంలో ప్రజలలో ఉంటూ, మన చుట్టూ జరుగుతున్న నేరాల గురించి అవగాహన కల్పించాలి.**

**యస్.హెచ్.ఒ లకు పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.**

సత్యమేవ జయతే, సంగారెడ్డి ఝరాసంఘం, రాయికోడ్ హద్నూర్ పోలీసు స్టేషన్ లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ల పరిసరాలు, సిబ్బంది బ్యారక్స్ పరిశుభ్రతను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అనంతరం స్టేషన్ రికార్డ్ లను తనిఖీ చేసి ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. ప్రతి వర్టికల్ కు ఒక అధికారిని నియమించి, రికార్డ్స్ ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని యస్.హెచ్.ఓ కు సూచనలు చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, మిస్సింగ్ కేసుల చేదనకు స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేయాలని యస్.హెచ్.ఓ. లకు సూచనలు చేశారు. సిబ్బంది అధికారులు స్టేషన్ కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, సిబ్బంది అధికారులు 24 / 7 అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేయాలని అన్నారు. హిస్టరీ షీటర్స్, సస్పెక్ట్స్ పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, నైట్ బీట్, పెట్రోల్లింగ్ అధికారులు వీధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీట్, హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. మన చుట్టూ జరుగుతున్న ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్స్ గురించి, రోడ్డు ప్రమాదాల గురించి కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా జిల్లా ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం, తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్ లు గుర్తించి, సూచిక బోర్డు లను ఏర్పాటు చేయించాలన్నారు. యస్.హెచ్.ఒ వీలైనంత ఎక్కువ సమయంలో ప్రజలలో ఉంటూ, మన చుట్టూ జరుగుతున్న నేరాల గురించి అవగాహన కల్పిస్తూ వారిని అప్రమత్తం చేయాలి అన్నారు. విజిబుల్ పోలిసింగ్ లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్, ఈ-పెట్టి కేసులు నమోదు చేయాలని యస్.హెచ్.ఒ లకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే





సత్యమేవ జయతే నాగలిగిద్ద నాగలిగిద్ద మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలతో సమావేశమై ఈనెల 27 తేదీన వరంగల్ లో జరగబోయే బిఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ గురించి వారికి దిశా నిర్దేశం చేసిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు పండరి మాజీ ఎంపిటిసి నందు పటేల్ తాజా మాజీ సర్పంచులు తాజా మాజీ ఎంపీటీసీలు గ్రామ పార్టీ అధ్యక్షులు తాజా మాజీ వార్డ్ సభ్యులు ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు

## ముమ్మాటికి మల్లీశ్వరిది ప్రభుత్వ హత్యయే : గాజుల కృష్ణరెడ్డి



సత్యమేవ జయతి : జోగులాంబ గద్వాల జిల్లా కేటి దొడ్డి మండలం నల్లగొండ జిల్లా బొక్క ముంతల వహావాడ్ గ్రామానికి చెందిన ధర్మరపు మల్లీశ్వరి అనే 27 ఏళ్ల దళిత యువతి కులవివక్షతో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బిఆర్ఎస్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఫోటో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు.. ఈ కార్యక్రమంలో కేటి దొడ్డి మండల బిఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కుల వివక్షతో మల్లీశ్వరి అనే యువతి మరణం పట్ల ప్రభుత్వం కావాలని నిజాన్ని దాచి నిందితులను పక్కదారికి పట్టించే ప్రయత్నం చేస్తుందని ధ్వజమెత్తారు, ఏడు సంవత్సరాలు ప్రేమించిన వ్యక్తి , పెళ్లి వచ్చేసరికి కులం అడ్డు వచ్చిందని ప్రశ్నించారు?, ముమ్మాటికి కుల వివక్షతోనే మల్లీశ్వరి మరణించిందని తెలియజేశారు, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు... ఈ కార్యక్రమంలో గోవింద్ నాయుడు, గోపాల్, దుబ్బన్న, కిష్టప్ప, ఈరన్న, వడ్డే రంగప్ప, గోవిందు, నరసింహులు,తదితరులు పాల్గొన్నారు

# ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి.

**జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి.**

**రోడ్డు ప్రమాదాల నివరణకు చర్యలు తీసుకోవాలి.**

**ప్రజలకు సమార్ధవంతమైన సేవలు అందిచాలి.**

**నెలవారి నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి**





సత్యమేవ జయతే, మెదక్
పోలీస్ స్టేషన్లలో ఉన్న
పెండింగ్ లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్ %ఇ% నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు.
గ్రేవ్ %ఇ% నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి అన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీస్ అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు.
సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అంధించాలని అన్నారు.
ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని తెలియజేశారు.
విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అధెవిదంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు.
జిల్లా పోలీసు అధికారులకు సిసి కెమెరాల పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రద్దీ గల ప్రదేశాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీని వలన నేరలను చేధించడంలో సిసి కెమెరాలు ఉపయోగపడుతాయని, గతం లో చాలా కేసులు సిసి కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తించడం జరిగిందని అన్నారు. కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ సూచించారు.
ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పి మహేందర్ రెడ్డి, తూప్రాన్ డిఎస్పీ వెంకట్ రెడ్డి, మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్, సైబర్ క్రైమ్ డిఎస్పీ సుభాష్ చంద్ర బోస్, ఎఆర్ డిఎస్పీ రంగా నాయక్, మెదక్ టౌన్ సిఐ నాగరాజు మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి, అల్లాదుర్గ్ సిఐ రేణుక, తూప్రాన్ సిఐ రంగా కృష్ణ ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మధు సుధన్ గౌడ్, ఎసై లు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు మరోసారి పరీక్ష రాసే అవకాశం




సత్యమేవ జయతే - మెదక్మెదక్ : మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2016 నుండి 2021 వరకు విద్యనభ్యసించి ఫెయిల్ అయిన విద్యార్థులకు పరీక్షలు రాసుకునేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుమతి ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ ఇవాళ ఒక ప్రకటనలో తెలిపారు. 2016-17, 2017-18, 2018-19, 2019-20 విద్యా సంవత్సరాల్లో 1 నుండి 6 సెమిస్టర్లలో ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాసుకోవచ్చన్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా మే 19వ తేదీ వరకు, అపరాధ రుసుముతో మే 29వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. 6 సెమిస్టర్లలో ఎవరైనా ఫెయిల్ అయిన విద్యార్థులు ఉంటే పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.
ఈ అవకాశం ఒకసారి మాత్రమే ఉంటుందన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలోని పరీక్ష విభాగం అధికారి శరత్రెడ్డిని సంప్రదించాలన్నారు.

## ఎంఆర్ఎఫ్ ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలి : బీరం మల్లేశం




సత్యమేవ జయతే - సదాశివపేట
సదాశివపేట : సంగారెడ్డి జిల్లాలోని అనేక పరిశ్రమల్లో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూ మెరుగైన వేతన ఒప్పందాలు చేస్తున్న చరిత్ర సీఐటీయూకు ఉందన్నారు కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం. కావున రాబోయే ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలన్నారు. ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో జరిగే కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం కోరారు. ఇవాళ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఎంఆర్ఎఫ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీరం మల్లేశం మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతుందన్నారు. జిల్లాలోని అనేక పరిశ్రమల్లో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూ మెరుగైన వేతన ఒప్పందాలు చేస్తున్న చరిత్ర సీఐటీయూకు ఉందన్నారు. కావున రాబోయే ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్కుమార్, ఎంఆర్ఎఫ్ యూనియన్ నాయకులు నర్సింలు, రాజు, రేవనప్ప, బాగారెడ్డి, రమేష్రెడ్డి, వెంకటేశం, ఎండీ హాజీ, కృష్ణమూర్తి, శాంతకుమార్, విజయవీర్, శివకుమార్, ధన్రాజ్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## : కేసీఆర్ బహిరంగ సభ వాల్ పోస్టర్ వేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు




సత్యమేవ జయతే - సంగారెడ్డి సంగారెడ్డి : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి లో ఈ నెల 27వ తేదీన జరిగే రజతోత్సవ భారీ బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్ ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు వేశారు...
సంగారెడ్డి జిల్లా నుంచి గులాబీ దండు వేలాదిగా కదం తొక్కలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు పిలుపునిచ్చారు...
కేసీఆర్ బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో చర్చ జరుగుతుంది... అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుంది...
ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన బి ఆర్ ఎస్ సిద్ధంగా ఉంది బి ఆర్ ఎస్ ను ఆశీర్వదించడానికి ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారు ...కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, పట్టణ కార్యదర్శి నర్సింలు, మండల అధ్యక్షులు చక్రపాణి, విఠల్ ,కార్యదర్శి గోవర్ధన్, మల్లేశం, మల్ల గౌడ్, శ్రవణ్ రెడ్డి, ప్రేమనందం, విఠల్, షఫీ తదితరులు పాల్గొన్నారు. ..

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన యువ నాయకులు



సత్యమేవజయతేబినారాయణఖేడ్నారాయణఖేడ్ నియోజికవర్గం సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు అఫ్రోజ్ నాన్నమ్మ కొద్దీ రోజుల క్రితం అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని ఈరోజు వారి ఇంటికి యువనాయకులు సాగర్ షేట్కార్ వెల్లి వారి కుటుంబన్ని పరామర్శించారు.వారితో పాటు శివకాంత్ పటేల్, విష్ణు వర్ధన్ రెడ్డి, జగదీష్, విట్టల్ రెడ్డి, దినకర్ రెడ్డి తదితరులు కలరు

## పలు శుభకార్యలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే







సత్యమేవజయతేబినారాయణఖేడ్కల్హేర్ మండలం ఇందిరానగర్ తండాకు చెందిన మాలోత్ చందర్ నాయక్ కూతురు, మనూర్ మండలం మాయికోడ్ బిఆర్ఎస్ పార్టీ అద్యక్షడు చంద్రకాంథ్ కూతురు, నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి శరణప్ప కుమారుడు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రామ్ సింగ్,విఠల్ రావు పటేల్,పరమేశ్,, మాజీ సర్పంచులు రాములు నాయక్, సంగప్ప, సంజీవ్,రాజు పటేల్ , మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, టీచర్లు రవీందర్,నాగేశ్వర్, నాయకులు లక్ష్మణ్ నాయక్,సుధాకర్,మల్లు పటేల్,భూమయ్య,,హనుమా%శీ%డ్లు తదితరులు ఉన్నారు.

## వేసవి కాలం దృష్టా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే



సత్యమేవజయతేబినారాయణఖేడ్నారాయణఖేడ్ నియోజకవర్గ ఎంపీడీవో అధికారులతో క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు పట్లొళ్ళ సంజీవరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతు నారాయణఖేడ్ నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ఇందిరమ్మ గృహాలకు అర్హులైన వారినే ఎంపిక చేయాలన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్నారు. అందువల్ల అధికారులు స్పందించి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, నియోజకవర్గంలోని ఎంపీడీవోలు సత్తయ్య , రమేష్ బాబు, శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ హుస్సేన్, విట్టల్, మహేష్ కుమార్ మన్సూర్ , నాయకులు వినోద్ పాటిల్ , తదితరులు పాల్గొన్నారు.

## ఊరడమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య..



. సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా...నవాబ్ పేట్ మండలం మీనపల్లి కలాన్లి గ్రామంలో జరిగిన ఊరడమ్మ జాతరలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించిన చేవెళ్ల స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ అందరికి దేవుడు దయ ఉండాలి అన్నారు..

**ఎమ్మెల్యే గారితో ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, భక్తులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.**

## ప్రభుత్వ పాఠశాల లోని పైకప్పు పెచ్చులు ఊడి విద్యార్థిని పై పడడంతో తీవ్ర గాయాలు...



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లావికారాబాద్ జిల్లా దారుర్ మండలం మున్నూరు సోమారం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న శిరీషపై (6 సంవత్సరాలు) పాఠశాల పైకప్పు పెచ్చులూడి అమ్మాయి తలపై, చెవికి, కాళ్లకు తగిలి గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి ఆ అమ్మాయిని మా శారద హాస్పిటల్ వికారాబాద్ కు తరలించగా, డాక్టర్ రాజశేఖర్ ఆ బాలికకు చికిత్సను అందిస్తున్నారు.
విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఆసుపత్రికి వచ్చి విద్యార్థిని పరామర్శించారు...

## ఎడిటోరియల్

# ఆ రెండు పార్టీల్లో నాయకత్వ సంక్షోభం

డొనాల్డ్ ట్రంప్ తన సుంకాలను ప్రకటించినప్పటి నుండి ప్రపంచం గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటోంది. భయంకరమైన అనిశ్చితిలో మునిగిపోయింది.మెక్సికో వంటి చిన్నదేశాలు సైతం ట్రంప్ ధోరణులను ఎండగడుతూ ఎదురు దాడులకు దిగుతున్నారు. కానీ, ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారత దేశ నాయకులు మాత్రం నిస్తేజంగా కనిపిస్తున్నారు. తమ రాజకీయ మనుగడ కోసం దగ్గరిదారులు వెతుకుతున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గత వారం తన నియోజక వర్గాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎక్కువగా ఆధ్యాత్మిక పోస్టులను సోషల్ మీడియాలో చేశారు. మహావీర్ జయంతి నాడు, 'భగవాన్ మహావీర్ ఆదర్శాలు నాతో సహా లెక్కలేనన్ని మందికి ఎంతో స్ఫూర్తినిచ్చాయి' అని పోస్ట్ చేశారు.వారణాసి నుండి, ప్రధానమంత్రి హనుమంతుడి జన్మదినం నాడు సంకట్ మోచన్ మందిరాన్ని సందర్శించగలిగినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ విశ్వనాథుని ఆశీర్వాదాలు తన నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడానికి తనను ఎలా ప్రేరేపించాయో చెప్పారు. కొత్త వక్ఫ్ చట్టం, ప్రభుత్వం సాధించిన విజయాలు వంటి అంతర్గత అంశాలపై కొన్ని రాజకీయ అంశాలను కూడా ప్రస్తావించినా ప్రపంచాన్ని ఆర్థిక గందరగోళానికి నెట్టివేస్తున్న తన 'మిత్రుడు' ట్రంప్ గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేకపోతున్నారు. ట్రంప్ సుంకాల ప్రభావం గురించి ప్రతిపక్షాలు కోరినా పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సాహసించలేదు. ఈ గందరగోళం నుండి భారతదేశ ప్రజలకు తగు రక్షణ కల్పిస్తానని ఒక్కసారి కూడా భరోసా ఇచ్చే ప్రయత్నం చేయలేదు. మరోవంక, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అహ్మదాబాద్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 84వ సమావేశంలో పాల్గొంటూ సుదీర్ఘమైన, ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు గాని అందులో కూడా ఈ సుంకాల గురించి ప్రస్తావించలేదు. కులజనాభా గణన, 50 శాతం పరిమితికి మించి దిగువ కులాలకు రిజర్వేషన్లు, దళితులు, ఒబిసిలు, గిరిజనులు నరేంద్ర మోడీ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం కారణంగా ఆర్థికంగా ఎదగలేకపోవడం వంటి అంశాలకు పరిమితమయ్యారు. సుంకాలను ప్రస్తావించినా ట్రంప్ తన స్నేహితుడు మోడీని ఎలా నిరాశపరిచాడో ఎగతాళి చేయడానికి పరిమితమయ్యారు. తన సమక్షంలోనే డొనాల్డ్ ట్రంప్ సుంకాలను పెంచే తన ప్రణాళికల గురించి చెబుతున్నా ప్రధాని నిశ్శబ్దంగా కుర్చున్నారంటూ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో అటు బిజెపిలో మోడ, ఇటు కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ నాయకత్వాల పట్ల విశ్వాసం సన్నగిల్లుతుంది. మరో నాయకత్వం వైపు ఆయా పార్టీ శ్రేణులు చూస్తున్నారు.

దానితో వారిద్దరూ దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యల పట్ల దృష్టి సారించే పరిస్థితులలో లేరని చెప్పవచ్చు. అంతకు ముందే ప్రధాని మోడీ నాగ్‌పూర్ పర్యటన సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి, ఆ సంస్థ నాయకత్వంతో ఏర్పడిన అగాధాన్ని పూడ్చుకునే ప్రయత్నం చేశారనే వార్తలు వచ్చాయి. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బిజెపి సంస్థాగతంగా బలం పుంజుకుందని, గతంలో మాదిరిగా తమకు ఆర్ఎస్ఎస్ అండదండలు అవసరం లేదని, తమ వ్యవహారాలను తామే చూసుకోగలమని బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా ఒక ఇంటర్వ్యూలో పేర్కొనడం సంఘ్‌పరివార్‌లో కలకలం రేపింది. దాని ప్రభావంతోనే 400 సీట్లతో గెలుస్తామని 'మోడీ గ్యారంటీ'గా చెప్పుకొంటూ ఎంతగా ప్రచారం చేసుకున్నా, 240 సీట్లకు పరిమితం కావాల్సి వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటుకు టిడిపి, జెడి(యు) వంటి పక్షాలపై ఆధార పడాల్సివచ్చింది. ఇక మోడీ సారథ్యంలో బిజెపికి భవిష్యత్ లేదనే అభిప్రాయాలు బలం పుంజుకొని వస్తున్నాయి. ఆ తర్వాత జరిగిన హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో అసంభవం అనుకున్న విజయాలను బిజెపి సాధించడం వెనుక ఆర్ఎస్ఎస్ కార్యకర్తల వ్యూహాత్మక పనితీరే కారణం అని స్పష్టం కావడంతో ఇప్పుడు తమ భవిష్యత్ గురించి బిజెపి నేతలు ఆ సంస్థ వైపు చూడటం ప్రారంభించారు.గతంలో ప్రధాన మంత్రిగా పలు సందర్భాలలో నాగ్‌పూర్ సందర్శించిన మోడీ ఏనాడూ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం సందర్శించే ప్రయత్నం చేయలేదు. అందుకనే 12 ఏళ్ళ తర్వాత ఇపుడు సందర్శించడం, ఈ సందర్భంగా తమ పరిపాలన తీరుపై పలు ప్రశ్నలను ఎదుర్కోవాల్సి రావడంతో ఆత్మరక్షణలో పడినట్లు కనిపిస్తున్నది. కొన్ని అంశాలపై గతంలో సైతం ఆర్ఎస్ఎస్- బిజెపిల మధ్య అంతరాలు ఏర్పడినప్పటికీ వాజపేయి హయాంలో పరస్పరం చర్చల ద్వారా అపరిష్కరించుకొనే వారు. నాటి ఆర్ఎస్ఎస్ అధినేత సుదర్శన్ నేరుగా వాజపేయిని కలిసి పరిష్కారం కనుగొనేవారు. ఏనాడూ సుదర్శన్ సూచనలను వాజపేయి పక్కనపెట్టిన ఉదంతాలు లేవు.

# అల్లర్లకు చిరునామా బెంగాల్



%పశ్చిమ బెంగాల్‌లో ఒకదాని వెంట ఒకటిగా చోటుచేసుకుంటున్న వివాదాలు ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలకు సవాలుగా పరిణమిస్తున్నాయి. నిరుడు పార్ల మెంటు ఎన్నికలకు ముందు జరిగిన సందేశ్ ఖలీ మానభంగాల కేసు, గత ఏడాది చివర్లో కోల్‌కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసు ఎంతటి పెను వివాదాలకు కారణమయ్యాయో తెలిసిందే. ఈ మధ్య 26 వేల మంది స్కూలు టీచర్ల నియామకాలను సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టడంతో మరో వివాదం దీదీ ప్రభుత్వాన్ని అతలాకుతలం చేస్తుండగా, గోరుచుట్టుపై రోకటిపోటులా తాజాగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లు మొదలయ్యాయి.వారం రోజుల క్రితం వక్ఫ్ సవరణ చట్టం అమలులోకి రాగా, దేశంలో ఎక్కడా లేనంత తీవ్ర స్థాయిలో బెంగాల్‌లో అల్లర్లు మొదలయ్యాయి. ముస్లిం జనాభా ఎక్కువగా గల ముర్షీదాబాద్, మాల్డా, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాలు నిరసనలతో అట్టుడుకుతున్నాయి. ఈ అల్లర్లకు ఇప్పటికే ముగ్గురు బలికాగా, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు భారీస్థాయిలో ధ్వంసమయ్యాయి. నిరసనకారులు ప్రధాన రహదారుల్ని, రైల్వే ట్రాకుల్నీ దిగ్బంధం చేస్తూ ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా అల్లర్లు తగ్గుముఖం పట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అల్లర్ల మాట అలా ఉంచితే, రాష్ట్రంలో విపక్ష భారతీయ జనతాపార్టీ, అధికార తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ స్వప్రయోజనాలకోసం పాకులాడుతూ, జరిగిన సంఘటనకు బాధ్యత మీదంటే మీదేనంటూ దుమ్మెత్తి పోసుకుంటున్నాయి.బెంగాల్‌లో ఎప్పుడు అల్లర్లు చెలరేగినా దాన్ని ప్రభుత్వ తప్పిదంగా అభివర్ణించే బిజెపి ఈసారి కూడా అదే పాట పాడింది. ఇటీవల 26 వేల మంది టీచర్ల నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వ ప్రతిష్ఠ మంటగలవడంతో దానినుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకు వేసిన ఎత్తుగడ ఇదని కమలనాథులు ఆరోపిస్తున్నారు. దీనిని అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి.. వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిన కేంద్రమే అల్లర్లకు బాధ్యత వహించాలనే రీతిలో మాట్లాడుతున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన చట్టం గురించి కేంద్రాన్నే అడగాలని, రాజకీయాలకోసం అల్లర్లకు దిగవద్దని ఆమె ఇచ్చిన పిలుపునకు నిరసనకారులు ఏమాత్రం స్పందించడంలేదు సరికదా మరింత పేట్రేగిపోతున్నారు. అల్లర్లకు కేంద్ర బిందువైన ముర్షీదాబాద్ జిల్లాలో ముస్లిం జనాభాదే ఆధిపత్యం.

ఈ జిల్లాలోని మూడు పార్లమెంటు సీట్లనూ తృణమూల్ గెలుచుకుంది. 22 అసెంబ్లీ స్థానాల్లో 20 సీట్లకు తృణమూల్ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీదే పైచేయి. అలాంటప్పుడు, అల్లర్లు ఎలా చెలరేగాయన్న ప్రశ్నకు అధికార పార్టీనుంచి జవాబు లేకపోవడం గమనార్హం. గతంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడూ ముర్షీదాబాద్ భగ్గుమంది.ఇంతటి సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంలో ముందుజాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేదో ప్రభుత్వమే జవాబు చెప్పాలి. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం అల్లర్ల విషయంలో బాధ్యత విస్మరించి స్వప్రయోజనాలకోసం పాకులాడుతూండటంతో పౌరులే ముందుకొచ్చి బెంగాల్ పరిస్థితిపై జోక్యం చేసుకోవలసిందిగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఈ మేరకు హైకోర్టు జోక్యం చేసుకుని, తక్షణం రాష్ట్రానికి కేంద్ర భద్రతా బలగాలను పంపించాలంటూ ఆదేశించడం గమనార్హం. వక్ఫ్ చట్టంలో లొసుగులున్నాయని ఎవరైనా భావిస్తే, వాటిని న్యాయస్థానాలలో సవాల్ చేసే హక్కు ఉంది. అంతే తప్ప, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అల్లర్లకు దిగడం సమంజసం కాదు.అలాగే, సమాజంలో ఒక వర్గాన్ని బుజ్జగించేందుకుగాను వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి చెప్పడం ప్రజాస్వామిక వ్యవస్థనే పరిహాసం చేసే విధంగా ఉంది. పార్లమెంటు చేసిన చట్టాలను మరో మాట లేకుండా అమలు చేయవలసిన బాధ్యత రాష్ట్రప్రభుత్వాలదే. ఈ విషయంలో రాష్ట్రాలకు ఎలాంటి మినహాయింపులూ ఉండవు. అలాంటప్పుడు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న దీదీ పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని అమలు చేయబోమని ఎలా చెబుతారు? ప్రతిపక్షాల ఆరోపణలను వమ్ము చేసేందుకు దీదీ ప్రభుత్వం అల్లర్లను నిర్దాక్షిణ్యంగా అణచివేసి, తన చిత్తశుద్ధిని నిరూపించుకోవలసిన అవసరం ఉంది. మరో ఏడాదిలో శాసనసభ ఎన్నికలకు సమాయత్తమవుతున్న బెంగాల్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు వాంఛనీయం కాదు.

# నైతిక విద్య నేటి అవసరం



నేడు సమాజంలో విలువల పతనం కొట్టొచ్చినట్టు స్పష్టంగా కనబడుతోంది. మానవుల్లో నైతిక విలువలు నశించడంతో అనేక దుష్పరిణామా లు సంభవిస్తున్నాయి. మనిషిలో అసూయ, ద్వేషం, స్వార్థం పెరిగిపోయి కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడుతున్నారు. దోపిడీ, దొంగతనం, హత్యలు, స్మగ్లింగ్ కిడ్నాప్ మొదలగునవి నిత్యకృత్యమైపోయాయి. కులాలపేరిట, మతాలమాటున ప్రతిరోజు ఏదో ఒక చోట మారణహోమాలు జరుగుతున్నాయి. మానభంగాలు, లైంగిక వేధింపులు, భ్రూణహత్యలు లాంటి అమానవీయ సంఘటనలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి.నైతిక విద్య ద్వారానే ముందు తరాలు మంచి విలువలతో పెరిగి సమాజంలో శాంతి సంక్షేమాలు వెల్లివిరుస్తాయి. భారతదేశంలో ప్రాచీన విద్యా విధానం విద్యార్థులలో విలువలు పెంపొందించడానికి జ్ఞానం, నైపుణ్యం అలవడటానికి ప్రాధాన్యత ఇచ్చింది. ప్రాచీన విద్యా విధానంలో నీతినియమాలను కేంద్రీకృతం తీసుకొని బోధన కొనసాగింది. నేడు ప్రాథమిక స్థాయినుంచి కళాశాలల స్థాయివరకు అనేక విద్యాసంస్థలు విద్యార్థులకు పోటీ ప్రపంచాన్ని అలవాటు చేయాలనే తపనతో నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి ముందుకు పోతున్నాయి. నేడు మహిళలపై వరుసగా జరుగుతున్న అమానుష ఘటనలు, నేర ప్రవృత్తి, అసాంఘిక కార్యకలాపాలకు విరుగుడుగా నైతిక విలువలను ప్రత్యేక పాఠ్యపుస్తకంగా ఆరో తరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.విద్యారంగంలో విలువల పతనం సామాజిక వ్యవస్థ అంతటికీ మచ్చతెస్తోంది. కొంతమంది విద్యార్థుల అనుచిత ప్రవర్తన నైతిక విలువలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నేటి ఆధునిక కాలంలో విద్యావిధానంలో వస్తున్న మార్పులు, విద్యాసంస్థల మధ్య వెర్రితలలు వేస్తున్న వ్యాపార పోటీ తత్వధోరణి బాలలను మార్కులు, ర్యాంకుల చుట్టూ మాత్రమే పరిభ్రమించేటట్లు చేస్తోన్నది. కార్పొరేటు పాఠశాలలు, కళాశాలలు, అందమైన బ్రోచర్లు, హోర్డింగులు, కరపత్రా ద్వారా తాము సాధించిన మార్కులు, ర్యాంకులు, ఐఐటి సీట్లను ప్రామాణికం చేస్తూ తాటికాయంత అక్షరాలతో ఆర్భాటంగా ప్రచారం చేయడాన్ని ప్రాధాన్యత చేసుకుంటున్నాయి. పాఠశాలల్లో విలువలు, నీతినియమాలు నేర్పించడానికి అవసరమైన సమయాన్ని కేటాయిస్తామని, విద్యార్థులు మంచి ఆదర్శపౌరులుగా రూపుదిద్దుతామని చెప్పే ఏ ఒక్క పాఠశాల, కళాశాల లేదంటే అతిశయోక్తి లేదు. కార్పొరేట్ చదువుల పుణ్యమా అని విద్యార్థులు చదువుల చట్రంలో ఊపిరి సలపనంతటి ఒత్తిడిలో కూరుకుపోతున్నారు.విద్యపేరిట పక్కా వ్యాపారం చేస్తున్న పాఠశాలలు, కళాశాలలు దేశంలో లెక్కలేనన్ని ఉన్నాయి. ఇవి ర్యాంకుల కోసం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. యాజమాన్యాలకు అండగా తల్లిదండ్రులు కూడా తోడవడంతో విద్యార్థులు తట్టుకోలేక, ఎవరికీ చెప్పుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పాఠశాల స్థాయిలో నైతిక అంశాలకు, విలువలకు, సూక్తులకు అవకాశం ఉన్న పాఠ్యాంశాలు ఎక్కువగా తెలుగు భాషలో మూడు నుంచి పదవ తరగతి వరకు ఉన్నాయి. వేమన శతకం, సుమతీ శతకం, మహాభారత నీతికథలు, చిన్నయ్య సూరి రాసిన స్నేహబంధం, శతక కవులు రాసిన శతక సుధ, శతక మధురిమ మొదలగునవి విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించడానికి ప్రభుత్వం పాఠ్యాంశాలుగా పెట్టింది. అదే విధంగా సాంఘిక శాస్త్రంలో కుటుంబాలు, కుటుంబ రకాలు సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సమాజం, సమాజంలో పౌరుల పాత్ర, హక్కులు, విధులు లాంటి అంశాలు విద్యార్థులలో సహకార భావనలు, విలువలను పాదుకోల్పడానికి చేర్చడం జరిగింది.నేడు అనేక ప్రైవేటు యాజమాన్యాలలో ఉన్న పాఠశాలల్లో తెలుగు, సాంఘిక శాస్త్ర బోధనను చిన్నచూపు చూస్తున్నాయి. రోజువారీ కాల పట్టికలో వాటికి పిరియడ్‌లు కేటాయించని పరిస్థితి నెలకొని ఉంది. వారంలో సగం రోజుల్లోనే వీటి బోధనను ముగించేస్తున్నారు. ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా అనేక కార్పొరేట్ కళాశాలలో తెలుగు, ఆంగ్ల పాఠ్యపుస్తకాలను వార్షిక పరీక్షల ముందు రెండు మాసాలలో ప్రారంభించి ముగిస్తున్నారు. రెండు మాసాల సమయంలో మార్కుల ప్రాతిపదికనే విద్యా బోధన ఉంటున్నది. ఇటువంటి పరిస్థితులలో పాఠశాల స్థాయినుంచి ఇంటర్మీడియట్ వరకు నైతిక అంశాలను, విలువలను విద్యార్థుల్లో పెంపొందించే పాఠ్యాంశాల బోధనకు ఆటంకం ఏర్పడి వాటికి విలువే లేకుండాపోతోంది. బాల్యంలో నేర్చుకోవాల్సిన నీతి నియమాలు, సత్ప్రవర్తన, విలువలు నిర్లక్ష్యం కావడంతో ఉన్నత విద్యావంతుల్లో విలువల పతనం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఉన్నత చదువులు చదివిన వైద్యుల్లో కొంతమంది డబ్బులకు కక్కుర్తిపడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిర్మాణరంగంలో అనేక సంవత్సరాలు మన్నికగా ఉండాల్సిన కట్టడాలు ఇంజనీరింగ్ అధికారుల అవినీతి వలన కుప్పకూలిపోతున్నాయి. నేరాలు అరికట్టాల్సిన కొంతమంది పోలీసులు వాటికి కొమ్ముకొస్తున్నారు.

అన్యాయాలకు అక్కడక్కడ అండగా న్యాయవాదులు, ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్న కల్తీ వ్యాపారులు, వేలకోట్ల రూపాయల దేశ సంపాదన కొల్లగొట్టి విదేశాలకు పారిపోతున్న బడాపార శ్రామికవేత్తలు మొదలగు వారంతా పెద్ద చదువులు చదివిన వారే కావడం గమనార్హం. విద్యార్థులకు మిగతా సబ్జెక్టుల మాదిరిగా నైతిక విలువలను ఒక పాఠ్యపుస్తకంగా పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# గరుడ పురాణంలో దానధర్మాల విశేషాలు..



హిందూ మతంతో పాటు ఏ మతంలో అయినా దాన ధర్మాలు చేయడం చేయడం అనేది ఒక పుణ్య కార్యంగా పరిగణించబడుతుంది. ఎవరైతే తమ సామర్థ్యం మేరకు నిరుపేదలకు, నిస్సహాయులకు దానధర్మాలు చేస్తారో.. వారికి మరణానంతరం కూడా ఎంతో పుణ్య ఫలం లభిస్తుందని గరుడ పురాణంలో వివరించబడింది. ఈ సందర్భంగా గరుడ పురాణం ప్రకారం, దానధర్మాల ప్రాముఖ్యత ఏమిటి, గరుడ పురాణం ప్రకారం ఎవరికి దానం చేయాలి.. దాన ధర్మాలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలగనున్నాయనే ఆసక్తికరమైన విశేషాలను ఇప్పుడు తెలుసుకుందాం...

దానధర్మాలు చేయడం వల్ల పుణ్యఫలాలు పెరుగుతాయని, ఈ జన్మలోనే కాకుండా వచ్చే జన్మలోనూ మంచి ఫలాలు వస్తాయని నమ్ముతారు. గరుడ పురాణంలోని ఆచార కాండలో, నీతిసార అధ్యాయంలో, సంతోషకరమైన, సంపన్నమైన జీవితం కోసం ఏమి చేయాలనే వివరాలు ప్రస్తావించబడ్డాయి. అందులో ముఖ్యమైన విషయం దానధర్మాలు. వీటిని ఎవరైతే తమ జీవితంలో అలవర్చుకుంటారో వారికి ధనానికి అస్సలు లోటుండదని గరుడ పురాణంలో వివరించబడింది.

దానధర్మాల ప్రాముఖ్యత..

గరుడ పురాణం ప్రకారం, పేదవారు ఎప్పటికీ దాన ధర్మాలు చేయకూడదు. పేదవారిగా ఉన్నప్పుడు దానం చేయడం వల్ల మరింత పేదలుగా మారొచ్చు. కాబట్టి పేరు ప్రతిష్టల కోసం దానధర్మాలు చేయడం మానుకోండి. అయితే ఎవరు దానం చేయాలంటే.. ఒక వ్యక్తి తాను సంపాదించిన సొమ్ము లేదా ఆస్తిలో పదో వంతు అంటే పది శాతం వరకు దానం చేయాలని శాస్త్రాల్లో వివరించబడింది. ఎవరికైతే అవసరం ఉంటుందో వారికే దానం చేయాలి. అప్పుడే మీరు చేసిన దానానికి తగిన ఫలితాలు లభిస్తాయి.

డబ్బులు ఎక్కువగా ఉండే వారు..

ఎవరి దగ్గర అయితే ఎక్కువ డబ్బులు ఉంటాయో వారు కచ్చితంగా పేదలకు సహాయం చేయాలి. దీని వల్ల మీకు ప్రయోజనం చేకూరుతుంది. అలాగే తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఎల్లప్పుడూ మంచి మర్యాదల గురించి నేర్పించి, వారిని సంస్కారవంతులుగా తయారు చేయాలి. ఇలా చేయని వారి తల్లిదండ్రులకు సమాజంలో అవమానాలు ఎదురవుతాయి.

స్వప్రయోజనాల కోసం దోపీడీలు చేయకండి..

మీ స్వలాభం కోసం ఎవరికీ చెడు చేయకూడదు. ఎవరి దగ్గర దోపిడీ చేయడం వంటివి చేయకండి. ఒకవేళ ఇలా చేస్తే మీరు కఠినమైన శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగే ఇతరులను మీ స్వప్రయోజనాల కోసం వాడుకున్నప్పుడు కూడా మీరు తాత్కాలికంగా సంతోషపడినప్పటికీ, దాని వల్ల మీకు తర్వాత కఠినమైన శిక్షలు అమలవుతాయి.

అన్యాయం, మోసం చేసే వ్యక్తులకు ఎప్పటికీ దాన ధర్మాలు చేయకండి. అలాంటి వ్యక్తులకు ఎంత వీలైతే అంత దూరంగా ఉండాలి. అయితే ఎల్లప్పుడూ మంచి లేదా నీతి నిజాయితీగా ఉండే వ్యక్తులతో కలిసి ఉండాలి. వీరి వల్ల సమాజంలో మీకు గౌరవం, ప్రతిష్ట లభిస్తుంది.

# హనుమాన్ చాలీసా పఠించడం వల్ల ఎన్ని ప్రయోజనాలో తెలుసా...



హిందూ మత విశ్వాసాల ప్రకారం, హనుమంతుడిని కలియుగ ప్రత్యక్ష దైవంగా పరిగణిస్తారు. ఆంజనేయుడి దర్శనంతో తమ జీవితంలోని కష్టాలన్నీ తొలగిపోతాయని నమ్ముతారు. 2023 హిందూ పురాణాల ప్రకారం, ఆంజనేయ స్వామికి ఎంతో విశిష్టత ఉంది. చిరంజీవి అయిన మారుతీ నేటికీ భూమి తిరుగుతున్నాడని చాలా మంది నమ్మకం. ఆంజనేయుడిని ఆరాధించడం వల్ల ఇంట్లో సంతోషం, ఆనందం, సంపద, సానుకూల శక్తి పెరుగుతాయని నమ్ముతారు. ఇదిలా ఉండగా.. శ్రీరాముడికి భక్తుడైన ఆంజనేయ స్వామిని ప్రసన్నం చేసుకుంటే శ్రీరాముని ప్రత్యేక అనుగ్రహం లభిస్తుంది. అంతేకాదు హనుమాన్ చాలీసా పఠించడం వల్ల మన జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈ నేపథ్యంలో హనుమాన్ జయంతి రోజున హనుమంతుడిని పూజించి.. హనుమాన్ చాలీసా పఠించడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయనే ఆసక్తికరమైన విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం... హనుమంతుడు శ్రీరామునికి గొప్ప భక్తుడు. హనుమ భక్తికి మెచ్చి శ్రీరాముడు ప్రసన్నుడయ్యేవాడని పురాణాల్లో వివరించబడింది. ఎక్కడైె శ్రీరామ కీర్తనలు, రామ కథలు, రాముని పాటలు వస్తాయో.. అక్కడ ఆంజనేయస్వామి ఏదో ఒక రూపంలో వస్తారని, భక్తుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తారని చాలా మంది నమ్ముతారు. అలాగే మంగళవారం నాడు రావి ఆకులపై బెల్లం నూనెతో కలిపిన మిశ్రమాన్ని తీసుకుని, ఆ ఆకులపై రాముని పేరు రాసి ఆంజనేయుడికి నైవేద్యంగా పెడితే కష్టాల నుంచి విముక్తి లభిస్తుంది.

వాస్తు ప్రకారం, ఇంట్లో హనుమాన్ ఫోటో పెట్టాలనుకుంటే.. ఈ విషయాలు గుర్తుంచుకోండి...!

దుష్ట శక్తుల ప్రభావం తొలగిపోయేందుకు..

జయ హనుమాన జ్ఞానగుణసాగర
జయ కపీశ తిహుం లోక ఉజాగర..
రామదూత అతులితబలధామ
అంజనీ పుత్ర పవనసుతనామా..

ఈ శ్లోకాన్ని హనుమాన్ జయంతి రోజున ఒక్కసారి పఠిస్తే చాలు దుష్ట శక్తుల నుంచి విముక్తి లభిస్తుందని.. అంతేకాదు కొండంత ధైర్యం వస్తుందని పండితులు చెబుతారు. ఈ శ్లోకాలన్నీ పరమ పవిత్రమైన హనుమాన్ చాలీసాలో ఉన్నాయి.

**మంగళ, శనివారాల్లో..**

ఆంజనేయ స్వామికి సింధూరం అంటే ఎంతో ఇష్టం. తనకు ఎంతో ప్రీతికరమైన మంగళవారం, శనివారాల్లో పచ్చిమిర్చి సమర్పించడం వల్ల శుభప్రదంగా పరిగణించబడుతుంది. అంతేకాకుండా, హనుమంతునికి శనగలను సమర్పించడం ద్వారా అన్ని రకాల ప్రతికూల శక్తుల నుంచి విముక్తి లభిస్తుంది. హనుమాన్ చాలీసాను ప్రతిరోజూ పఠించడం వల్ల వ్యక్తి జీవితంలోని కష్టాలన్నీ తొలగిపోతాయని, వారి జీవితంలో ఎలాంటి సమస్యా ఉండదని చాలా మంది నమ్ముతారు.

హనుమాన్ చాలీసా పఠించే వ్యక్తికి బలం, తెలివి, మేధస్సు పెరుగుతుంది.. అదే విధంగా అన్ని రకాల దుఃఖాలన్నీ దూరమవుతాయి.హనుమంతుడిని సానుకూలతకు చిహ్నంగా పరిగణిస్తారు. వాయుపుత్రుడైన హనుమంతుడిని భక్తి శ్రద్ధలతో పూజించడం వల్ల అన్ని రకాల వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుందని, ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటారని, ఆంజనేయుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని చాలా మంది నమ్ముతారు.

# రాశిఫలాలు




**మేషం**
ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. ప్రయత్నకార్యాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభం ఉంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

**వృషభం**
గౌరవ మర్యాదలకు లోపం ఉండదు. అనవసర వ్యయ ప్రయప్రయాసలు ఉంటాయి. వృధా ప్రయాణాలు ఎక్కువ చేస్తారు. మానసిక ఆందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధు మిత్రులతో వైరం ఏర్పడకుండా జాగ్రత్త వహించాలి. శారీరకంగా బలహీనులవుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

**మిథునం**
కళాకారులు, మీడియా రంగాల వారికి మంచి అవకాశాలు లభిస్తాయి. దేహాలంకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు. పేరు, ప్రతిష్ఠలు సంపాదిస్తారు. నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలను పొందుతారు.

**కర్కాటకం**
అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ, సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది. నూతన వస్తు, ఆభరణాలు సేకరిస్తారు.

**సింహం**
స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడతాయి. నూతన గృహకార్యాలపై శ్రద్ధవహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలు అధికమవుతాయి.

**కన్య**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధనలాభంతో రుణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచిపేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకోవడానికి కృషిచేస్తారు. స్త్రీలు, బంధు, మిత్రులను కలుస్తారు.

**తుల**
నూతన కార్యాలు ఆలస్యంగా ప్రారంభిస్తారు. అల్పభోజనం వల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురిచేస్తుంది. వీలైనంతవరకు అసత్యానికి దూరంగా ఉండటం మంచిది. అనవసర భయాందోళనలకు లోనవుతారు.

**వృశ్చికం**
మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగి ఉంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శతృబాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక లాభాలు ఉంటాయి.

**ధనుస్సు**
విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా ఉంటుంది. ప్రయాణాలు ఎక్కువగా చేస్తారు. మెలకువగా ఉండటం అవసరం. స్థానచలనం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. రుణలాభం పొందుతారు. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఉంటాయి.

**మకరం**
కుటుంబకలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఎదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా ఉండటం మంచిది. అందరితో స్నేహంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి.

**కుంభం**
ఆర్థిక ఇబ్బందులు ఉండవు. నూతన వస్తు, ఆభరణాలు ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధైర్యసాహసాలతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. శుభవార్తలు వింటారు.

**మీనం**
ప్రయత్నకార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభం ఏర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు. కొత్త కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు.

# రాముడు నడయాడిన 'రామతీర్థం'

**భక్తుల కొంగు బంగారంగా.. మెట్ట ప్రాంత ఆరాధ్య దైవంగా.. పతిభక్తికి ప్రతిరూపంగా.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా.. అంటరానితనం నిర్మూలనకర్తగా.. వలస వాసుల వరాల తల్లిగా విరాజిల్లుతున్న నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 27 వరకు జరగనున్నాయి. ఏటా జ్యేష్ఠ మాసంలో వచ్చే పౌర్ణమి దాటిన మొదటి ఆదివారం నుంచి గురువారం వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు హాజరవుతారు. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో దేవదాయ శాఖ అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.**



వెంగమాంబ చరిత్ర దుత్తలూరు మండలం నర్రవాడ పంచాయతీ మజరా గ్రామమైన వడ్డిపాళెం వాస్తవ్యులైన పచ్చవ వెంగమనాయుడు, సాయమ్మ దంపతులకు కుల దైవమైన రేణుకాదేవి అనుగ్రహంతో వెంగమాంబ జన్మించింది. వెంగమాంబకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన ఉండేది. వెంగమాంబకు నర్రవాడకు చెందిన వేమూరి గురవయ్యతో తల్లిదండ్రులు వివాహం జరిపించారు. వివాహానంతరం భర్తకు అనుకూలంగా ఉంటూ ఆదర్శ దంపతులుగా ఉండేవారు. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడేవారు. అభాగ్యులను ఆదుకుంటూ ఆదర్శ గృహిణిగా నిలిచారు. అగ్రవర్ణాలు దళితులను మంచినీటి బావుల వద్దకు రాకూడదనే సమయంలో ఈమె నీటిని చేది దళితులకు అందించేవారు. వారి కోసం బావిని కూడా తవ్వారు.

ఇప్పటికీ ఆ బావిని వేమూరి వారి బావిగా పిలుస్తున్నారు. ఒక రోజు ఆమె భర్త గురవయ్యనాయుడు పశువులను మేపేందుకు గ్రామ సమీపంలోని అడవికి వెళ్లారు. దీన్నే దొడ్డకొండ అంటారు. అదే సమయాన వెంగమాంబ స్నేహితులతో కలిసి గడ్డికోసం అడవికి వెళ్లారు. ఇంతలో అకస్మాత్తుగా దొంగలు వచ్చి వెంగమాంబ, స్నేహితులను అటకాయించారు. దీంతో బిగ్గరగా కేకలు వేశారు. అడవిలో ఉన్న గురవయ్య ఒక్క ఉదుటున అక్కడికి చేరుకుని దొంగలతో తలపడ్డారు. దొంగలందర్నీ హతమార్చగా ఒక దొంగ చాటుగా ఈటెతో గురవయ్య గుండెకు విసిరాడు. దీంతో గురవయ్యకు తీవ్రగాయమై రక్తస్రావమై స్పృహ కోల్పోయారు. మూడు రోజుల పాటు భార్య వెంగమాంబ, గ్రామస్తులు ఎన్ని సపర్యలు చేసినా స్పృహలోకి రాలేదు. దీంతో వెంగమాంబ తన భర్త మరణించకముందే ముత్తయిదువుగా అగ్నిగుండ ప్రవేశం చేయాలని నిర్ణయించుకొని తల్లిదండ్రులు, గ్రామస్తులను ఒప్పించారు. నర్రవాడ గ్రామంలోని మధ్యభాగాన అందరూ చూస్తుండగానే అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆమె అగ్నిగుండ ప్రవేశం చేసిన తెల్లవారి అక్కడ వెంగమాంబ మంగళసూత్రాలు, పైటకొంగు కాలకుండా గ్రామస్తులకు కనిపించాయి. అనంతరం వెంగమాంబ తన స్నేహితురాలైన తుమ్మల పెదవెంగమ్మ, వెంగమాంబ బావగారైన ముసలయ్యనాయుడికి కల్లో కనిపించి తనకో దేవాలయాన్ని నిర్మించాలని కోరారు. అనంతరం వెంగమాంబకు దేవాలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఏటా అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

**అమ్మ పెట్టుబడితో వ్యాపారంలో అధిక ఆదాయాలు**

వెంగమాంబ పేరంటాలు దేవస్థానం తరఫున అమ్మవారి నగదును భక్తులకు అందజేస్తారు. భక్తులు రూ.100 చెల్లిస్తే అమ్మవారి నగదును చిల్లర రూపంలో రూ.80 అందజేస్తారు. ఈ నగదును వ్యాపార పెట్టుబడిలో కలపగా అధిక ఆదాయాలు వస్తాయనేది భక్తుల నమ్మకం. ఈ విధంగా అధిక ఆదాయాలు పొందిన భక్తులు అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి తమ వంతు కానుకలను అందిస్తున్నారు. అమ్మవారి పేరుతో పలు జిల్లాలు, రాష్ట్రాల్లో వ్యాపార సంస్థలు, హొటళ్లు నడుస్తున్నాయి.

**దేవస్థానానికి చేరుకునేదిలా..**

దుత్తలూరు మండలం నర్రవాడలో దేవస్థానం ఉంది. ఇక్కడికి చేరుకోవాలంటే నెల్లూరు నుంచి దుత్తలూరు మీదుగా పామూరు వెళ్లే మార్గంలో నర్రవాడలో దిగాలి. ఒంగోలు నుంచి కందుకూరు మీదుగా దుత్తలూరు వెళ్లే మార్గాన, కడప నుంచి బద్వేలు, ఉదయగిరి, దుత్తలూరు మీదుగా పామూరు వెళ్లే మార్గాన, పోరుమామిళ్ల నుంచి సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు మీదుగా పామూరు మార్గాన నర్రవాడకు చేరుకోవాలి.

**బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు**

ఐదు రోజుల పాటు జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23న నిలుపు కార్యక్రమంతో ప్రారంభంకానున్నాయి. అదే రోజున సంతానం లేని మహిళలు అమ్మవారి ముందు వరపడతారు. 24న వెంగమాంబ, గురవయ్య రథోత్సవం, సంతానం లేనివారు వరపడతారు.

25న రథోత్సవం, 26న ఉదయం వెంగమాంబ, గురవయ్య కల్యాణోత్సవం, పసుపు, కుంకుమ ఉత్సవం, రాత్రికి ప్రదానోత్సవం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్సవాల్లో చివరి రోజైన 27న పొంగళ్లు, ఎడ్ల బండలాగుడు పందేలు, తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సారి బ్రహ్మోత్సవాలు జరిగే అన్ని రోజుల్లో అన్నదాన, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

# రాజస్థాన్.. ఉత్కంఠ పోరులో ఢిల్లీ విజయం













ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులను కట్టిపడేసింది. ఆఖరి వరకు గెలుపు దోబూచులాడిన మ్యాచ్ ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెట్టింది. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన మ్యాచ్‌లో ఆఖరికి రాజస్థాన్‌పై ఢిల్లీ క్యాపిటల్స్‌దే పైచేయి అయ్యింది. నిర్ణీత ఓవర్లలో ఇరు జట్ల స్కోర్లు సమమయ్యాయి. దీంతో విజేతను నిర్ణయించేందుకు జరిగిన సూపర్ ఓవర్‌లో ఢిల్లీ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. మొత్తంగా ఈసీజన్‌లో జరిగిన తొలి సూపర్ ఓవర్‌లో రాజస్థాన్‌పై ఢిల్లీ జయకేతనం ఎగురవేసింది. అలవోకగా గెలువాల్సిన మ్యాచ్‌ను రాజస్థాన్ చేజేతులా వదులుకుని హ్యాట్రిక్ పరాజయాన్ని మూటగట్టుకుంది.ఐపీఎల్ మరో పోరు దుమ్మురేపింది! పంజాబ్ కింగ్, కోల్‌కతా నైట్‌రైడర్స్ లోస్కోరింగ్ మ్యాచ్ అభిమానుల మదిలో నుంచి చెరిగిపోక ముందే ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ పోరు పతాక స్థాయికి తీసుకెళ్లింది. బుధవారం జరిగిన ఈ సీజన్ తొలి సూపర్ ఓవర్ పోరులో రాజస్థాన్‌పై ఢిల్లీ ఉత్కంఠ విజయం సాధించింది. ఢిల్లీ నిర్దేశించిన 189 పరుగుల లక్ష్యఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 188/4 స్కోరు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్(37 బంతుల్లో 51, 3ఫోర్లు, 4సిక్సలు), నితీశ్‌రానా(28 బంతుల్లో 51, 6ఫోర్లు, 2సిక్సలు) అర్ధసెంచరీలతో విజృంభించారు. వీరిద్దరు ఢిల్లీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. ఆఖర్లో ధృవ్ జురెల్(17 బంతుల్లో 26, 2సిక్సలు), హెట్‌మైర్(9 బంతుల్లో 15 నాటౌట్, ఫోర్) జట్టును గెలిపించేందుకు చేసిన ప్రయత్నం నెరవేరలేదు. స్టార్క్, అక్షర్, కుల్దీప్ ఒక్కో వికెట్ తీశారు. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ.. అభిషేక్ పొరెల్ (37 బంతుల్లో 49, 5 ఫోర్లు, 1 సిక్స్), కేఎల్ రాహుల్ (32 బంతుల్లో 38, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో 20 ఓవర్లలో 188/5 స్కోరు చేసింది. ఆర్చర్(2/32)కు రెండు వికెట్లు దక్కాయి.

జైస్వాల్, రానా రాణించినా:ఛేదనలో రాయల్స్ ఇన్నింగ్స్ సైతం వేగంగానే ప్రారంభమైంది. శాంసన్ (19 బంతుల్లో 31 రిటైర్డ్ హర్ట్, 2 ఫోర్లు, 3 సిక్సర్లు), జైస్వాల్ దూకుడుగా ఆడారు. ఈ ఇద్దరూ ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన ముకేశ్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడారు. ముకేశ్ రెండో ఓవర్లో ఇద్దరూ తలా ఓ సిక్సర్ కొట్టారు. స్టార్క్ 3వ ఓవర్లో జైసాల్.. 4, 6, 4తో 19 రన్స్ రాబట్టాడు. పేసర్లతో లాభం లేదని అక్షర్.. స్పిన్నర్ విప్రాజ్‌కు బంతినివ్వగా శాంసన్.. ఓ ఫోర్, సిక్సర్‌తో అతడికి స్వాగతం పలికాడు. కానీ అదే ఓవర్లో కట్ షాట్ ఆడే క్రమంలో పక్కటెముకలు పట్టేయడంతో అతడు రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. శాంసన్ స్థానంలో వచ్చిన పరాగ్ (8) నిరాశపరిచాడు. 34 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తిచేసిన జైస్వాల్‌ను కుల్‌దీప్ ఔట్ చేశాడు. అప్పటికే క్రీజులో కుదురుకున్న రానా..అక్షర్‌పటేల్‌ను లక్ష్యంగా చేసుకుంటూ 15వ ఓవర్‌లో ఓ భారీ సిక్స్‌కు తోడు రెండు ఫోర్లతో అరుసుకున్నాడు. అయితే రానా నిష్క్రమణతో రాయల్స్ ఇన్నింగ్స్ గాడి తప్పింది. స్టార్క్ వేసిన ఆఖరి ఓవర్‌లో విజయానికి 9 పరుగులు అవసరం కాగా జురెల్ వికెట్ కోల్పోయిన రాజస్థాన్ 8 పరుగులకే పరిమితమైంది. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది.పొరెల్ మెరుపులతో ఢిల్లీ ఇన్నింగ్స్ ధాటిగానే మొదలైనా పవర్ ప్లేలో రెండు కీలక వికెట్లు కోల్పోయాక ఆ జట్టు స్కోరువేగం నెమ్మదించింది. తుషార్ రెండో ఓవర్లోనే పొరెల్.. 4, 4, 6, 4, 4తో 23 రన్స్ పిండుకున్నాడు. కానీ ఈ సీజన్‌లో తడబడుతున్న ఫ్రేసర్ మెక్‌గర్క్ (9).. ఆర్చర్ మొదటి ఓవర్లోనే బ్యాక్ టు బ్యాక్ బౌండరీలు బాదినా అతడే వేసిన 3వ ఓవర్లో జైస్వాల్ చేతికి చిక్కడంతో ఢిల్లీ తొలి వికెట్ కోల్పోయింది. గత మ్యాచ్‌లో అదిరిపోయే ఇన్నింగ్స్ ఆడిన కరుణ్ నాయర్.. పొరెల్‌తో సమన్వయం లోపించి పరుగులేమీ చేయకుండానే రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత ఢిల్లీ పరుగుల వేటలో వెనుకబడింది. రాహుల్ (38).. బంతికో పరుగన్నట్టుగానే ఆడగా ఆరంభంలో రెచ్చిపోయిన పొరెల్ కూడా వేగంగా ఆడలేకపోయాడు. ఆర్చర్ రాహుల్‌ను ఔట్ చేయగా హసరంగ బౌలింగ్‌లో అర్ధశతకానికి ఒక్క పరుగు దూరంలో పొరెల్ నిష్క్రమించాడు. అక్షర్ (14 బంతుల్లో 34, 4 సిక్సర్లు, 2 సిక్సర్లు) ఢిల్లీ ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చాడు. హసరంగ ఓవర్లో 4, 4 ,6తో రెచ్చిపోయిన ఢిల్లీ సారథి.. తీక్షణ 16వ ఓవర్లో 6, 4, 4తో అలరించాడు. ఆఖర్లో స్టబ్స్ (34 నాటౌట్), అశుతోశ్ (15 నాటౌట్) ఢిల్లీకి పోరాడే స్కోరునందించారు.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 188/5 (పొరెల్ 49, రాహుల్ 38, ఆర్చర్ 2/32, హసరంగ 1/38)బీ

రాజస్థాన్: 20 ఓవర్లలో 188/4(జైస్వాల్ 51, రానా 51, అక్షర్ 1/23, కుల్దీప్ 1/33)

## పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| గుజరాత్ | 6 | 4 | 2 | 8 | 1.08 |
| ఢిల్లీ | 5 | 4 | 1 | 8 | 0.89 |
| బెంగళూరు | 6 | 4 | 2 | 8 | 0.67 |
| లక్నో | 7 | 4 | 3 | 8 | 0.08 |
| కోల్‌కతా | 6 | 3 | 3 | 6 | 0.80 |
| కోల్‌కతా | 6 | 3 | 3 | 6 | 0.80 |
| పంజాబ్ | 5 | 3 | 2 | 6 | 0.06 |
| ముంబై | 6 | 2 | 4 | 4 | 0.10 |
| రాజస్థాన్ | 6 | 2 | 4 | 4 | -0.83 |
| హైదరాబాద్ | 6 | 2 | 4 | 4 | -1.24 |
| చెన్నై | 7 | 2 | 5 | 4 | -1.27 |

# అమ్మచేతి.. ఇఫ్తార్ ముద్ద!

'ఇఫ్తార్' అంటే విందు కాదు.. దానం. ఆ మాటను నిజం చేస్తున్నది లుఖ్మా కమ్యూనిటీ కిచెన్. ఇక్కడివంటవాళ్లంతా మహిళలే.. భర్తను కోల్పోయినవారు, లేదంటే భర్తకు దూరమై బతుకుతున్నవారు. 'ఇఫ్తార్' అంటే విందు కాదు.. దానం. ఆ మాటను నిజం చేస్తున్నది లుఖ్మా కమ్యూనిటీ కిచెన్. ఇక్కడివంటవాళ్లంతా మహిళలే.. భర్తను కోల్పోయినవారు, లేదంటే భర్తకు దూరమై బతుకుతున్నవారు. ఆ తల్లులు ఆత్మగౌరవంతో జీవించేందుకు, పిల్లల జీవితాల్ని మంచిగా తీర్చిదిద్దేందుకు తనవంతు భరోసా ఇస్తున్నదీ వంటశాల.హలీం.. ఇఫ్తార్‌కు మరో పేరు. ఇక, హైదరాబాదీ విందు అంటే బిర్యానీ పసందే. వీటికి తోడుగా మటన్ షామి, చికెన్ షామి, లుక్మా చికెన్, దమ్ కా ఖీమా, కటీ దాల్, కుబానీ కా మీఠా, డబుల్ కా మీఠా, ఫ్రూట్ సలాడ్.. సకల రుచులూ సకాలంలో సిద్ధం చేయడానికి హెడ్ చెఫ్ రజియా బేగం ఓ యుద్ధమే చేస్తున్నారు. కమ్యూనిటీ కిచెన్‌ను ఓ వార్ రూమ్‌లా మార్చేశారు.








చార్మినార్ సమీపంలోని సఫా అనే ఎన్జీవో కార్యాలయం పై అంతస్తులో ఉన్న లుఖ్మా కమ్యూనిటీ కిచెన్‌లో రంజాన్ మాసమంతా ఇదే హడావుడి. మహిళా బృందం తెల్లవారు జాము నుంచే వంటలు మొదలుపెడుతుంది. 'రాత్రి వచ్చిన ఆర్డర్లకు సరిపడా సరుకులున్నాయా, లేదా?' అంటూ కిచెన్ మేనేజర్ నాహిద్ బేగం లెక్కలేస్తుంటే.. మధ్యాహ్నానికి తయారు చేయాల్సిన వంటకాలకు మసాలాలు నూరుతూ, కూరగాయలు తరుగుతూ మరికొందరు బిజీగా ఉంటారు. చకచకా వండేయడం, తయారైన వాటిని అందమైన బాక్సుల్లో ప్యాక్ చేయడం, ఆర్డర్ల వారీగా లెక్కలు చూసుకుని సరైన చిరునామాకు అందేలా సకల జాగ్రత్తలూ తీసుకుని.. ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలకు అప్పగించడం..ఇలా ప్రతి పనీ పక్కాగా జరుగుతుంది అక్కడ. హైదరాబాద్‌లోని వందలాది కుటుంబాలకు ఇఫ్తార్ విందులు ఇక్కడి నుంచే వెళ్తాయి.ద'లుఖ్మా' అంటే అరబిక్‌లో అమ్మచేతి ముద్ద. ఎంతోమందికి అమ్మలా అన్నం పెడుతూ ఈ అమ్మలు తమ బిడ్డల ఆకలి తీరుస్తున్నారు. విజయానికి ప్రమాణాలు లేవు. అనుకున్నది సాధించడానికి, సంతృప్తిగా జీవించడానికి మించిన గెలుపూ లేదు. ఎన్నో అడ్డంకుల్ని దాటి ఈ స్థాయికి చేరుకున్నారు లుఖ్మా కమ్యూనిటీ కిచెన్ చెఫ్‌లు.

### కార్వాన్‌తో ఆరంభం..

లుఖ్మా కమ్యూనిటీ కిచెన్ విజయం పాతబస్తీ పేద మహిళల సమష్టి శ్రమ ఫలితం. ఈ ఫలాలకు బీజాలు వేసిన 'కార్వాన్' (ప్రయాణం) కార్యక్రమం 2018లో మొదలైంది. రుబీనా నఫీస్ ఫాతిమా ఆధ్వర్యంలోని 'సఫా' సంస్థ పహాడీ షరీఫ్ ప్రాంతంలోని పేద మహిళల కుటుంబ పరిస్థితులపై అధ్యయనం చేసింది. వితంతువులు, ఒంటరి మహిళల కష్టనష్టాలను తెలుసుకున్నది. స్థానిక మహిళలు తమ పిల్లలకు సరైన తిండి కూడా పెట్టలేని దుస్థితిలో ఉన్నారనీ, విద్య, వైద్యం కూడా అందడం లేదనీ ఆ బృందానికి అర్థమై పోయింది. తగినంత ఆదాయం లేకపోవడమే దీనికి కారణమని తీర్మానించారు. ఆ విష వలయం నుంచి వారిని బయటికి లాగాలనుకున్నారు.

### మహిళకు పుట్టుకతోనే అబ్బే కళ..

పాకశాస్త్రం. ఆ నైపుణ్యమే ఆయుధంగా పేదరికంపై యుద్ధం ప్రకటిం చింది. సఫా మొదలుపెట్టిన 'కార్వాన్' కార్యక్రమంతో వాళ్ల జీవితాల్లో నిజంగానే ముందడుగు పడింది. నిరుపేద మహిళలకు నెల రోజులపాటు శిక్షణ ఇప్పించారు. కొత్త వంటలు నేర్పించారు. సంప్రదాయ రుచుల తయారీలో తర్ఫీదు ఇచ్చారు. ఇప్పుడు విశాలమైన వంటశాలలో, హైదరాబాదీ రుచులే కాదు కాంటినెంటల్ డిష్‌లు కూడా వండి మెప్పిస్తున్నారు వాళ్లంతా. ఫంక్షన్లు, బర్త్ డే పార్టీలకు క్యాటరింగ్ సర్వీస్ మొదలుపెట్టారు. బహుళజాతి కంపెనీల ఈవెంట్స్‌కు ఆర్డర్లు సంపాదిస్తున్నారు. యూఎస్ కాన్సులేట్ (హైదరాబాద్)ను కూడా లుఖ్మా కమ్యూనిటీ కిచెన్ ఆకర్షించింది. కాన్సులేట్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో.. వివిధ దేశాల రాయబారులు, రాజకీయ ప్రముఖులకు హైదరాబాదీ రుచులు వడ్డించే అవకాశం ఇచ్చింది.

### సవాళ్లను స్వీకరించి..

'పాకశాస్త్ర నైపుణ్యం పెంచుకుని వంట మనిషిగా పని చేయాలనుకునే వారికి, చిన్న హోటల్ పెట్టుకుని ఆర్థికంగా స్థిరపడాలనుకున్న వారికి.. మేం ఉచితంగా పాఠాలు బోధిస్తాం. ఎక్కడ ఉపాధి అవకాశాలున్నా.. చెబుతాం. మా దగ్గర శిక్షణ తీసుకున్న చాలా మంది ఉద్యోగాలు చేస్తున్నారు. ఆన్‌లైన్ యాప్‌ల పుణ్యమాని.. ఇంటి దగ్గరే కమ్యూనిటీ కిచెన్లు పెట్టుకున్నారు. క్యాటరింగ్ సర్వీస్ నడిపిస్తున్నారు' అని వివరిస్తారు లుఖ్మా కమ్యూనిటీ కిచెన్ మేనేజర్ నాహిద్ బేగం. నిజమే, అనేక జీవితాలు మారి పోయాయి. ఇక్కడే హెడ్ చెఫ్‌గా పనిచేస్తున్న రజియా బేగం సంగతే తీసుకోండి. భర్త చనిపోయాడు.

### ఆస్తులేమీ లేవు....

అయిదుగురు పిల్లలు. అత్త మామల బాధ్యతా కూడా తనపైనే పడింది. తన కాళ్ల మీద తాను నిలబడాలని అనుకుంటున్న సమయంలో సఫా గురించి తెలిసింది. వంటలో శిక్షణ తీసుకున్నది. లుఖ్మాలోనే చెఫ్‌గా ఉద్యోగం దొరికింది. పిల్లల్ని ప్రైవేటు స్కూల్‌లో చదివిస్తున్నది. స్కూటర్ కూడా నడిపిస్తున్నది. ఆ ఆవరణలో ఇలాంటి గెలుపు కథలు, మెరుపు కథలు వందలకొద్దీ.

ఈ పవిత్ర రంజాన్ మాసం ఆ మహిళలకు అల్లాహ్ అనుగ్రహాన్నే కాదు, ఆత్మవిశ్వాసాన్నీ ఇచ్చింది.

# సౌందర్య కీర్తి!





శ్రీకీర్తి తండ్రి రమేశ్‌బాబు సిప్లా ఫార్మాలో ఉద్యోగి. తల్లి రమాదేవి బీఎస్ఎన్ఎల్‌లో ఇంజినీర్. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. డాక్టరు కావాలన్నది శ్రీకీర్తి కల. సంప్రదాయ నృత్యమూ నేర్చుకునేది. ఇంటర్మీడియట్‌లో ఉన్నప్పుడు ఓ రోడ్డు ప్రమాదం ఆమె కలను చిదిమేసే ప్రయత్నం చేసింది. అందాల కిరీటం దక్కాలంటే.. తళుకుబెళుకులు మాత్రమే సరిపోవు. అందమైన మనసు ఉండాలి. స్పందించే హృదయం అవసరం. సమాజాన్ని తన కుటుంబం అనుకోవాలి. ఈ అర్హతలన్నీ ఉన్నాయి కాబట్టే, ఇంటర్వెన్షనల్‌పల్మనాలజిస్ట్ డాక్టర్‌ఎంవీ శ్రీకీర్తి మిసెస్ తెలంగాణ, మిసెస్ హైదరాబాద్ హోదా దక్కించుకున్నారు.ఇప్పటికీ చాలామంది మహిళలు పెండ్లి కాగానే, ఇంటికే పరిమితం అవుతున్నారు. అక్కలూ.. చెల్లెళ్లూ! మీ ఆలోచన మార్చుకోండి. ఏదో ఒక వ్యాపకాన్ని ఎంచుకోండి. వాయిదా వద్దు. తక్షణం రంగంలోకి దిగండి. ఎదుటివారికి రోల్ మోడల్‌గా నిలవండి. శీకీర్తి తండ్రి రమేశ్‌బాబు సిప్లా ఫార్మాలో ఉద్యోగి. తల్లి రమాదేవి బీఎస్ఎన్ఎల్‌లో ఇంజినీర్. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. డాక్టరు కావాలన్నది శ్రీకీర్తి కల. సంప్రదాయ నృత్యమూ నేర్చుకునేది. ఇంటర్మీడియట్‌లో ఉన్నప్పుడు ఓ రోడ్డు ప్రమాదం ఆమె కలను చిదిమేసే ప్రయత్నం చేసింది. కాలికి తీవ్ర గాయమైంది. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. దీంతో, నాట్య సాధన ఆగిపోయింది. ఇంట్లోనే ఉంటూ మెడికల్ ఎంట్రెన్స్‌కు ప్రిపేర్ అయింది. ఎంబీబీఎస్‌లో సీటు తెచ్చుకుంది. మహిళలు చాలా తక్కువగా ఎంచుకునే పల్మనాలజీని ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. చదువు తర్వాత, జగిత్యాలలో ఇండిపెండెంట్ చెస్ట్ హాస్పిటల్ ప్రారంభించి ఎంతోమందికి తక్కువ ఖర్చుతో వైద్యం అందించింది. ప్రస్తుతం బంజారాహిల్స్‌లోని టీఎక్స్ హాస్పిటల్‌లో సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్‌గా సేవలందిస్తున్నది డాక్టర్ శ్రీకీర్తి.అందమైన మనసు 'మనం ఎప్పుడూ, ఎక్కడా ఆగిపోకూడదు. జీవితంలో ఒకటి కోల్పోతే.. మరొకటి సాధించేందుకు ప్రయత్నించాలి. పట్టుదలతో పోరాడాలి. యాక్సిడెంట్ వల్ల డ్యాన్స్‌కు దూరమైన నేను.. ఇతర కళల మీద ఆసక్తి పెంచుకున్నాను. అనుకోకుండా అందాల పోటీలకూ దగ్గరయ్యాను.

సౌందర్య కిరీటంతో మనకంటూ ఓ గుర్తింపు వస్తుంది. మన అభిప్రాయాలకు గౌరవం పెరుగుతుంది. అందుకే, వోగ్‌స్టార్ సంస్థ నిర్వహించిన అందాల పోటీల్లో పాల్గొన్నాను. పదిహేను వందల మందితో పోటీ పడ్డాను. నా నృత్య ప్రతిభను, వైద్యురాలిగా మహిళలకు అందించిన సేవలను పరిగణనలోకి తీసుకుని.. నన్ను మిసెస్ తెలంగాణ, మిసెస్ హైదరాబాద్‌గా ప్రకటించారు' అంటూ తన సౌందర్యయాత్రను వివరిస్తారు డాక్టర్ శ్రీకీర్తి. ఈ విజయం వెనుక అమ్మానాన్నల ప్రోత్సాహం, భర్త శశిధర్, టీఎక్స్ యాజమాన్యం మద్దతు చాలా ఉందని చెబుతారు.

ఒంటరి మహిళల కోసం సకల సదుపాయాలతో ఒక శరణాలయం, అనాథ బాలలకు అత్యున్నత ప్రమాణాలతో ఓ బడి.. ఈ రెండూ డాక్టర్ శ్రీకీర్తి రేపటి ఆలోచనలు.

# యురేకా.. ఇది పల్లె కేక!






ఆర్కిమిడీస్‌కు నీటి తొట్టెలో పుట్టింది. న్యూటన్‌కు యాపిల్ పడ్డప్పుడు తట్టింది. ఐడియా ఎప్పుడైనాపుట్టొచ్చు. ఆలోచన ఎవరికైనా రావొచ్చు. నగరంలోనే అంకురించాలన్న నియమేం లేదు. పట్టణానికే పరిమితం కావాలన్న పరిధీ లేదు. పల్లెలోనూ యురేకా... కేక వినిపించవచ్చు. ఇంటింటా ఇన్నొవేటర్ ఉండొచ్చు. టాలెంట్ ఎవరి సొత్తూ కాదు.

ఆర్కిమిడీస్‌కు నీటి తొట్టెలో పుట్టింది. న్యూటన్‌కు యాపిల్ పడ్డప్పుడు తట్టింది. ఐడియా ఎప్పుడైనాపుట్టొచ్చు. ఆలోచన ఎవరికైనా రావొచ్చు. నగరంలోనే అంకురించాలన్న నియమేం లేదు. పట్టణానికే పరిమితం కావాలన్న పరిధీ లేదు. పల్లెలోనూ యురేకా%ా% కేక వినిపించవచ్చు. ఇంటింటా ఇన్నొవేటర్ ఉండొచ్చు. టాలెంట్ ఎవరి సొత్తూ కాదు. తెలంగాణ ప్రభుత్వం ఇదే మాట నమ్మింది. పల్లె ప్రజలను ఇన్నొవేటర్లుగా దిద్దే పండుగ చేస్తున్నది. 'టీ- ఇన్నొవేషన్ మహోత్సవం'%ా% ప్రపంచ ఆవిష్కరణ దినోత్సవాన్ని పల్లెబాట పట్టిస్తున్నది. ఆ వేడుకల ఉద్దేశాలు, లక్ష్యాలను తెలంగాణ స్టేట్ ఇన్నొవేషన్ సెల్(టీఎస్ఐసీ) చీఫ్ ఇన్నొవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత **తౌటం వివరించారిలా**

తెలంగాణ అంటే ఇప్పుడు ఎన్నో రాష్ట్రాలకు రోల్ మాడల్. అభివృద్ధిలోనే కాదు%ా% ఆలోచనల్లో, సంపద సృష్టిలో, ఆవిష్కరణల్లో కూడా! ఐక్యరాజ్యసమితి ఏప్రిల్ 21వ తేదీని ప్రపంచ సృజనాత్మకత-ఆవిష్కరణ దినోత్సవంగా నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా ఈ తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో సమస్యల పరిష్కారానికి సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. 'టీ-ఇన్నొవేషన్ మహోత్సవం' పేరుతో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 21న 'అవర్ ఫర్ ఇన్నొవేషన్' కార్యక్రమాన్ని చేపడుతున్నది. గ్రామీణ స్థాయిలో ఆవిష్కరణల మీద అవగాహన కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ స్టేట్ ఇన్నొవేషన్ సెల్ (టీఎస్ఐసీ), పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. ప్రతిగ్రామం ఒక ఆవిష్కరణకు వేదిక కావడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి.

### ఊరూరికీ..

గతేడాది ఏప్రిల్ 21న రాష్ట్రంలో మొదటిసారి 'వరల్డ్ క్రియేటివ్ డే'ని 'ఇన్నొవేషన్ డే' పేరిట నిర్వహించింది టీఎస్ఐసీ. దీనికి విద్యార్థుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. 'తెలంగాణ యువతలో ఫైర్ ఉంది. సాధించాలన్న కసి ఉంది. వారికి కావాల్సిందల్లా ఒక అవకాశం.. ఒక ప్లాట్‌ఫామ్ మాత్రమే. అది ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉంది' అంటారు మంత్రి కేటీఆర్. యువత ఆలోచనలను సమస్యల వైపు నుంచి ఆవిష్కరణల దిశగా మళ్లించాలన్న ప్రయత్నమే 'టీ-ఇన్నొవేషన్ మహోత్సవం' లక్ష్యం. గతేడాది కేవలం విద్యార్థులు, యువతకే పరిమితమైన ఈ బృహత్ కార్యాన్ని.. ఈ ఏడాది పల్లె తెలంగాణకూ విస్తరింపజేస్తున్నది ప్రభుత్వం. స్థానికంగా ఉన్న సమస్యలకు అక్కడి ప్రజలే పరిష్కార మార్గాలు వెతకాలి. వారి ఆలోచనలే ఆవిష్కరణలై కొత్త ఒరవడికి శ్రీకారం చుడతాయి. అందుకే గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సైతం ఇందులో భాగమయ్యేలా కార్యాచరణ రూపొందించింది టీఎస్ఐసీ.

### పరిష్కారం దిశగా..

టీ-ఇన్నొవేషన్ మహోత్సవంలో భాగంగా తెలంగాణ అభివృద్ధిలో భాగమైన ఆవిష్కర్తల కథనాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కృతమైన అద్భుతాలను పల్లెల్లో ప్రదర్శించనున్నారు. స్థానిక సమస్యలకు స్థానికంగానే పరిష్కారం చూపే ఆవిష్కరణల గురించి అధికారులు అవగాహన కల్పిస్తారు. సమస్యను గుర్తించడం, దానికి పరిష్కారం చూపే ఆవిష్కరణను కనుగొనేలా గ్రామ పౌరులను తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ఉద్దేశం అంటారు శాంత తౌటం. ప్రభుత్వం తరపున గ్రామాల స్థాయిలో ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు టీఎస్ఐసీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని ఆమె చెబుతారు. ఈ ఏడాది మొత్తం 15వేల గ్రామాల్లో టీ-ఇన్నొవేషన్ మహోత్సవం నిర్వహించనున్నారు. 'ఇంటింటా ఇన్నొవేటర్' అన్న మంత్రి కేటీఆర్ మాటను నిజం చేసే దిశగా టీఎస్ఐసీ కార్యాచరణ అమలుచేస్తున్నది.

### నడిపించే శక్తి

ఏదైనా కార్యక్రమం ఫలవంతం కావాలంటే.. దాన్ని విజయవంతంగా నడిపే వ్యక్తి, శక్తి కావాలి. టీ హబ్, టీ వర్క్స్, టీఎస్ఐసీని నడిపించే శక్తి తెలంగాణ ప్రభుత్వం అయితే, దాన్ని ముందుకు తీసుకుపోతున్న వ్యక్తి డాక్టర్ శాంత తౌటం. వరంగల్‌లో పుట్టి పెరిగిన శాంత కిట్స్‌లో ఇంజినీరింగ్ చేశారు. తర్వాత అమెరికాలో మాస్టర్స్ చదివి ఐదేండ్లపాటు అక్కడే ఉద్యోగం చేశారు. ఒకవైపు పీహెచ్‌డీ చేస్తూనే ఆంత్ర ప్రెన్యూర్ రియల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉద్యోగిగా సేవలందించారు. ఆమె న్యూయార్క్‌లో పనిచేస్తున్న రోజుల్లో టీ-హబ్ గురించి మంత్రి కేటీఆర్ చెప్పిన మాటలు విని స్ఫూర్తి పొందారు. టీ హబ్‌లో పనిచేసేందుకు అమెరికాలో ఉద్యోగం వదిలేసి హైదరాబాద్ వచ్చారు. తనకు అవకాశమిస్తే సంస్థ బలోపేతానికి ఏం చేయగలరో వివరించారు. అలా టీ-హబ్‌లో ఉద్యోగిగా చేరిన శాంత అనతికాలంలోనే తానేంటో నిరూపించుకున్నారు. సుమారు మూడున్నరేండ్లు అక్కడ సేవలు అందించారు. తన పనితనంతో అందరి మన్ననలు అందుకు న్నారు. 2021లో టీఎస్ఐసీ చీఫ్ ఇన్నొవేషన్ అధికారిగా పదోన్నతి పొందారు. ఇప్పటివరకు శాంత సారథ్యంలో టీఎస్ఐసీలో వెయ్యికి పైగా ఇన్నొవేటర్లను రిక్రూట్ చేసుకున్నారు. వందలాది మంది ఉపాధ్యాయులకు, వేలాది మంది విద్యార్థులకు ఇన్నొవేషన్ మీద అవగాహన కల్పించేలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. 'స్కూల్ ఇన్నొవేషన్ ఛాలెంజ్' పేరుతో ప్రతి పాఠశాలలో విద్యార్థుల్లో ఇన్నొవేటివ్ ఆలోచనలు రేకెత్తించారు. యాభై మంది ఇన్నొవేటర్లు చేసిన ఆవిష్కరణలను మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా ఇప్పటివరకు రూ.4 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను ఇన్నొవేటర్లకు అందించారు.

### ఇలా పంపొచ్చు..

గ్రామంలో ఎవరికైనా ఒక సమస్యను పరిష్కరించే ఇన్నొవేటివ్ ఐడియా వస్తే దాన్ని పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లాస్థాయిలో డీఎస్‌వో, డీఈవో, కలెక్టర్, ఈ-డిస్ట్రిక్ మేనేజర్‌లకు చెప్పొచ్చు. లేదంటే 9100678543 నెంబర్‌కి ఫోన్‌గానీ, వాట్సాప్ గానీ చేయొచ్చు. tsic@telangana.gov.in ఐడీకి మెయిల్ చేయొచ్చు. ఎవరైనా, ఎక్కడివారైనా టీ-ఇన్నొవేషన్ మహోత్సవంలో పాల్గొనవచ్చు.